నేటి కందం- నేటికి అందం

సురవరు లొసగిన బ్రతుకును
తరిగించెడి క్యాన్సరు పయి తగు శోధనలన్
జరిపించుటకై-క్యాన్సరు
పరిశోధన దినమును జరుపగవలయు వెసన్

(సెప్టెంబర్ 24 క్యాన్సర్ పరిశోధన దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

వ్యక్తిగత ఆధిపత్య
వ్యవహారం నిత్యం
పార్టీలకది ముప్పుగా
పరిణమించు సత్యం
అధికారం తాత్కాలిక
అవకాశం మాత్రమే
సమన్వయం లోపిస్తే
సంక్షోభపు గాత్రమే

చురక

-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 24-9-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:45 పేజీలు:6 వెల: రూ.1/-

## ఒకే రోజు 25 విల్లాలు.. 19 భవనాలు కూల్చివేత



హైదరాబాద్, సెప్టెంబర్ 23 : సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్‌లో హైడ్రా చేపట్టిన చర్యలు చరిత్రలో ఇదే బిగ్ ఆపరేషన్. 17 గంటలపాటు నాన్ స్టాప్ కూల్చివేత పనులు చేపట్టారు. అలాగే ఓ హాస్పిటల్, రెండు అపార్ట్ మెంట్లు కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. పటేల్ గుడాలో 25 విల్లాలు, 19 భవనాలు, అలాగే ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆస్పత్రిని నేలమట్టం చేశారు. హైడ్రా ఏర్పాటు తర్వాత తొలిసారిగా డే అండ్ నైట్ కూల్చివేతలు జరిగాయి. అక్రమ నిర్మాణాలకు అనుకొని ఉన్న పక్క ఇళ్లకు డ్యామేజ్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

కూకట్‌పల్లిలో 16 షెడ్ల కూల్చివేత

కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో కొందరు వ్యక్తులు షెడ్లు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కేటరింగ్ కోసం కిచెన్‌లు ఏర్పాటు చేశారు. ఇతరత్రా వ్యాపారాలూ సాగుతున్నాయి. వాటిలో పనిచేసే కార్మికులు ఉండేందుకు తాత్కాలిక నివాసాలు నిర్మించారు. ఫిర్యాదుల నేపథ్యంలో పలుమార్లు చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు.. నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చారు. సర్వే నంబర్లు 66, 67, 68, 69లో ఉన్న 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీలను నేలమట్టం చేశారు. ఇందులో ఐదు కేటరింగ్ షెడ్లు, మూడు ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్మాణాలు, రెండు టెంట్ హౌస్‌లు, ఆరు గోడౌన్లు ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా ఆదివారం కూల్చివేసింది. కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో మూడు బహుళ అంతస్తుల భవనాలను హైడ్రా నేలమట్టం చేసింది. వీటిలో ఒకటి ఐదంతస్తుల భవనం కాగా, మరో రెండు భవనాలు నాలుగు అంతస్తులుగా నిర్మించారు. ఇవన్నీ నివాసేతర నిర్మాణాలు.

ఇటీవలే మునిసిపాలిటీలో విలీనమైన పటేల్‌గూడ పంచాయతీ పరిధిలోని బీఎ?సఆర్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 వరుస ఇళ్లను కూల్చివేశారు. ప్రభుత్వ సర్వే నంబర్ విస్తరించి ఉన్న 12 సర్వే నంబర్ భూమి పక్కనే ఉన్న సర్వే నంబర్ 6 లోని పట్టా భూమిలో బిల్డర్లు ఇళ్లను నిర్మించారు. సర్వేలో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం తేలడంతో హైడ్రా కూల్చివేతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో కొన్ని కుటుంబాలు నివాసం ఉంటుండగా వారికి హైడ్రా అధికారులు, పోలీసులు నచ్చజెప్పి ఖాళీ చేయించారు.

## ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా అతిశీ బాధ్యతలు.. కానీ కుర్చీ వేరే..

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఢిల్లీ నూతన ముఖ్య మంత్రిగా అతిశీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం ఢిల్లీ సచివాలంలో సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గతంలో సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ కూర్చున్న కుర్చీలో కాకుండా.. వేరే కుర్చీలో కూర్చుని బాధ్యలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆప్ నేతలు పాల్గొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అతిశీ 5 నెలలు మాత్రమే ఢిల్లీ సీఎంగా ఉండనున్నారు. ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా అతిశీ శనివారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమెతోపాటు ఆప్ నేతలు గోపాల్‌రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్, అహ్లావత్ క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అతిశీ ఢిల్లీకి ఎనిమిదో ముఖ్యమంత్రి కాగా, అత్యంత పిన్న వయస్కురాలైన సీఎంగా ఆమె రికార్డులకెక్కారు. అలాగే, ఢిల్లీ పీఠాన్ని అధిష్ఠించిన మూడో మహిళగానూ మరో ఘనత సాధించారు.

## గూగుల్ టు ఎన్విడియా.. 15 టాప్ టెక్ సీఈవోలతో ప్రధాని మోదీ సమావేశం



న్యూ డిల్లీ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన కొనసాగుతోంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన ప్రధాని.. క్వాడ్ దేశాల సదస్సులో పాల్గొన్నారు. ఆ తర్వాత న్యూయార్క్‌లో జరిగిన ప్రవాస భారతీయులతో ప్రత్యేక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తాజాగా టెక్ కంపెనీల సీఈవోలతో ప్రధాని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్.. న్యూయార్క్‌లోని ఓ హోటల్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించింది. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 టాప్ టెక్ సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను మోదీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సీఈవోలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు సహా పలు అంశాలపై చర్చలు జరిపామన్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధించిన ప్రగతి గురించి మాట్లాడినట్లు చెప్పారు. మేడ్ బై ఇండియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

## హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం..

హైదరాబాద్, సెప్టెంబర్ 23 : హైదరాబాద్‌లో సోమవారం పలుచోట్ల వర్షం కురుస్తున్నది. తార్నక, ఓయూ క్యాంపస్, లాలాపేట, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, ముషీరాబాద్, చంపాపేట, సైదాబాద్, సరూర్‌నగర్, కోఠి, సుల్తాన్‌బజార్, బేగంపేట, అబిడ్స్, చాంద్రయాణగుట్ట, ఫలుక్‌నుమా, చార్మినార్ వద్ద వర్షం పడుతున్నది. బహదూర్‌పుర, ఉప్పుగూడ, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బోయిన్‌పల్లి, అల్వాల్, చిలకలగూడ, మేడ్చల్, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేటలో వర్షంపడుతున్నది. ఒక్కసారిగా వర్షం కురవడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇదిలా ఉండగా.. రాగల మూడురోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## స్పోర్ట్స్ & వెల్ఫేర్ బాధ్యతలు చేపట్టిన రమేష్ రెడ్డిని సన్మానించిన స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి.



హైదరాబాద్ సెప్టెంబర్ 23 ( ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇటీవలే ఐజిగా (స్పోర్ట్స్ ఢ వెల్ఫేర్) బాధ్యతలు చేపట్టిన రమేష్ రెడ్డి (ఐపీఎస్) ఎల్.బీ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా సత్కరించిన స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి. త్వరలో నిర్వహించే సిఎం కప్ 2024 దిగ్విజయంగా సాగాలని దానికి పోలీస్ శాఖ వారి పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు

## చైల్డ్ పోర్న్ వీడియోలు వీక్షించడం, డౌన్‌లోడ్ చేయడం.. పోక్సో నేరమే

### - సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పును ఇచ్చింది. చిన్నారులకు సంబంధించిన పోర్న్ వీడియోలను డౌన్ లోడ్ చేయడం కానీ, వీక్షించడం కానీ.. పోక్సో చట్టం కిందకు వస్తాయని అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. చిన్నారులపై లైంగిక వేధింపులను అడ్డుకునే చట్టానికి సంబంధించిన విషయంలో సుప్రీం ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. చైల్డ్ పోర్న్ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం కానీ, వీక్షించడం కానీ పోక్సో నేరం కాదు అని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆ తీర్పును ఇవ్వడంలో మద్రాసు కోర్టు తీవ్రమైన తప్పు చేసినట్లు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. 28 ఏళ్ల ఓ వ్యక్తి చైల్డ్ పోర్న్ వీడియోలను తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసిన కేసులో మద్రాసు హైకోర్టు ఈ తీర్పును ఇచ్చింది. ఆ వ్యక్తిపై నేరాభియోగాన్ని కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. దాన్ని ఇవాళ సుప్రీంకోర్టు రిస్టోర్ చేసింది. ఆ వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సుప్రీం తన ఆదేశంలో పేర్కొన్నది.

## గాంధీ హాస్పిటల్ పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ

### -అడ్డుకున్న పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు



హైదరాబాద్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గాంధీ హాస్పిటల్ వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. పోలీసు వాహనాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు. గాంధీ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. నేటి నుంచి నిపుణులైన డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఇందులో భాగంగా గాంధీ దవాఖానను పరిశీలించాల్సి ఉన్నది. అయితే కమిటీ పర్యటనను కాంగ్రెస్ సర్కార్ అడ్డుకున్నది. రాజయ్య సహా కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనేక నిర్బంధాల నడుమ గాంధీ దవాఖానకు చేరుకున్న కమిటీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నుంచి బయటకు రాకుండా భారీగా పోలీసులు మోహరించారు.

## పెండింగ్ లేకుండా రైతులందరికీ రుణాలు ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

### - బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష.

సంగారెడ్డి, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి):రుణమాఫీ



జరిగిన రైతులందరికీ కొత్త రుణాలు అందజేయాలని, రుణాల మంజూరులో జాప్యం చేయడం సరికాదని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో జిల్లాలోని బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రుణమాఫీ లో లబ్ధి పొందిన రైతులందరికీ కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాలన్నారు.

రుణ మంజూరులో బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంట వెంటనే రైతులకు రుణాల అందజేయాలన్నారు. రుణమాఫీలో లబ్ధి పొందిన రైతులకు ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. రుణమాఫీకి, పెన్షన్లు, కు క్రాప్ లోనుకు ముడి పెట్టకుండా కొత్త రుణాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఇప్పటివరకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 98 245 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, వీరిలో 73 514 మంది రైతులు కొత్త రుణాలు ఇవ్వడం జరిగింది అన్నారు. రుణమాఫీ పొందిన వారిలో ఇప్పటివరకు 75% మందికి కొత్త రుణాలు మంజూరు చేసినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్ రెడ్డి, కలెక్టర్ కి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, డి సి ఓ కిరణ్ కుమార్, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## ఆరు వారాల్లో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి నిర్ధారించాలి: హైకోర్టు

హైదరాబాద్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై హైకోర్టులో వాదనలు జరిగాయి. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధరణ శాస్త్రీయంగా జరగలేదని పిటిషన్లు వేశారు. ఎఫ్‌టీఎల్ నిర్ధరణపై దాఖలైన పిటిషన్లను సిజె ధర్మాసనం విచారించింది. ఎఫ్‌టీఎల్‌పై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని జీహెచ్‌ఎంసికి హైకోర్టు ఆదేశించింది. వారంలోపు చెరువుల పరిరక్షణ కమిటీకి బాధితులు అభ్యంతారాలు తెలపాలని సూచించింది. అభ్యంతరాలు పరిగణలోకి తీసుకున్న తరువాత ఆరు వారాల్లో ఎఫ్‌టీఎల్ పరిధి నిర్ధారించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కూల్చివేతలు చేపట్టబోమని కోర్టుకు జీహెచ్‌ఎంసి తెలిపింది. రికార్డుల ప్రకారం దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 65 ఎకరాలే ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దుర్గం చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధి 160 ఎకరాలు అధికారులు చెప్పడం సరికాదని పిటిషనర్లు వాపోతున్నారు.

## ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తా

### -ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### -200 మందితో కాంగ్రెస్ పార్టీలో ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహ్మాద్ అక్రమ్ చేరిక

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్ లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహ్మాద్ అక్రమ్ సుమారు 200 మంది సభ్యులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆది శ్రీనివాస్ కండువా వేసి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపికి వ్యతిరేకంగా లోక్సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

మన దేశం సెక్యులర్ దేశం అని, మన హిందు ముస్లింలు సోదర భావంతో ఉంటారన్నారు.

గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు 4 శాతం కల్పించిందని గుర్తు చేశారు.

వేములవాడ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న శాదిఖాన నిర్మాణం పూర్తి చేస్తానని, కబ్రస్థాన్ సమస్య పరిష్కరిస్తానని, మైనార్టీల సమస్యల పరిష్కారనికి కృషి చేస్తానని అన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని, దానికోసం ప్రతి ఒక్కరు శుశక్తులైన సైనికులుగా పనిచేయాలన్నారు.

గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిన వారందరికీ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం పలుకుతున్నామన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కింద త్వరలోనే ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. త్వరలోనే రేషన్ కార్డు ఇచ్చే ప్రక్రియ మొదలు కాబోతుందని, రేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డులు కూడా అందిస్తామని, వేములవాడ నియోజకవర్గంలో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

## బ్రిడ్జి పైనుంచి కిందపడిన బస్సు: ఆరుగురు మృతి



ముంబయి సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ స్నేవ్స్ );: మహారాష్ట్రలోని అమరావతి జిల్లా పరాట్వాడిధని రూట్‌లో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సెమడోహ ప్రాంతంలో మేల్‌ఘాట్ బ్రిడ్జి పైనుంచి బస్సు పడిపోవడంతో ఆరుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, ప్రభుత్వ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆరోగ్య కేంద్రాలకు తరలించామని అమరావతి కలెక్టర్ సౌరభ్ కటియార్ తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురిని పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. చావ్లా ట్రావెల్స్ కంపెనీకి చెందిన బస్సుగా గుర్తించామని పోలీసులు తెలియజేశారు. బస్సు అదుపుతప్పి పడిపోయినట్టు గుర్తించామన్నారు.

## పాటిగడ్డ బస్తీ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 : పాటిగడ్డ బస్తీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. బేగంపేట్ డివిజన్‌లోని ఎన్‌బిటి నగర్ పాటిగడ్డ బస్తీకు నూతనంగా బస్తీ అధ్యక్షుడిగా ఎన్నికైన శేఖర్ ముదిరాజ్ సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బస్తీ ప్రజలతో వచ్చి వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శేఖర్‌ను ఎమ్మెల్యే శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బస్తీ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అఖిల్, రఫీక్, ఆరీఫ్, ఇలియాజ్, సిద్ధిక్, నసీమా, శారద, అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా వినికిడి లోప దివ్యాంగులు

**(23-29 సెప్టెంబర్ 'అంతర్జాతీయ వినికిడిలోప దివ్యాంగుల వారోత్సవాలు' సందర్భంగా)**

ఐక్యరాజ్యసమితి, 'ప్రపంచ చెవిటి దివ్యాంగ సమాఖ్య' సంయుక్తంగా 1958 నుంచి ప్రతి ఏట 26 సెప్టెంబర్‌న 'ప్రపంచ వినికిలోప దివ్యాంగుల దినం (ఇంటర్నేషనల్ డెఫ్ డే)' పాటించడం ఆనవాయితీగా మారింది. సెప్టెంబర్ చివరి ఆదివారం రోజున, అనగా 29 సెప్టెంబర్ 2024న అంతర్జాతీయ వినికిడి లోప దినం, సెప్టెంబర్ చివరి వారంలో (సోమవారం నుంచి ఆదివారం వరకు) 2024 సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు 'అంతర్జాతీయ వినికిడ లోప దివ్యాంగుల వారం' కూడా పాటిస్తారు. సెప్టెంబర్ చివరి ఆదివారం, అనగా 29 సెప్టెంబర్ 2024న "ప్రపంచ డెఫ్ డే" నిర్వహించే ఆనవాయితీగా కూడా ఉన్నది.

**వినికిడిలోపంతో మూగతనం కూడా రావచ్చు:**

వినికిడి సమస్య కలిగిన ప్రజలను ఏకం చేయడానికి ప్రత్యేక సమాజం, సంస్కృతి, భాష మరియు సైన్ లాంగ్వేజ్ (సైగల భాష) ఉంటాయని తెలుసుకోవాలి. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో చెవిటితనానికి సంబంధించిన సమస్యలు ఉన్న ప్రజలు తమ వైకల్యాన్ని జయించి, సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. వినికిడి లోపం కలిగిన వారిలో అధికంగా మూగతనం కూడా కనిపిస్తుంది. వైకల్యం లక్ష్యసాధనకు అడ్డురాదని, సామాన్యుల వలె అంగ వైకల్యంతో బాధ పడుతున్న అభాగ్యులు పట్టుదలతో జీవితాలను సుసంపన్నం చేసుకుంటూ, అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. చెవిటి వర్గానికే చెందిన "అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ దినాన్ని" 23 సెప్టెంబర్‌న నిర్వహిస్తారు. చెవిటి వారి భాష, భావవ్యక్తీకరణాలకు ప్రత్యేక చిహ్నా బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. సైన్ లాంగ్వేజీలను ఒక భాషగా ఐరాస గుర్తించింది. సామాన్యులతో పాటు అంగవైకల్యం కలిగిన వారు కూడా కలిస్తే జాతి ప్రయోజనాలు పరిపూర్ణం అవుతాయి. చెవిటితనం జన్యపరంగా లేదా ఇన్‌ఫెక్షన్లతో కూడా రావచ్చని తెలుస్తున్నది.

**ప్రపంచవ్యాప్త సమస్య:**

ప్రపంచవ్యాప్తంగా 466 మిలియన్ల చెవిటి దివ్యాంగులు, అందులో 34 మిలియన్ల పిల్లలు ఉన్నారు. పిల్లల్లో 60 శాతం నయం చేయగల చెవిటితనం ఉందని గుర్తించారు. చెవిటి వారిలో 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన పేద ప్రజలే ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 12-35 ఏండ్ల వయస్సు కలిగిన 1.1 బిలియన్ల ప్రజలు వినికిడి సమస్యకు చేరువలో ఉన్నారని, వీరికి సరైన సమయానికి వైద్యం అందని యెడల చెవిటి వారుగా మిగిలిపోతారని అంచనాకు వచ్చి హెచ్చరిస్తున్నారు. అంగవైకల్యంతో జీవించే వారికి మాత్రమే 300లకు పైగా సైన్ లాంగ్వేజ్‌లు అందుబాటులో ఉన్నాయి. మానవుడి నేత్రాలు అనేక భావాలను పలికిస్తాయి. మాటలకు అందని మనోహర భాషగా సైన్ లాంగ్వేజ్‌లు అంగవైకల్యం కలిగిన వారికి వినియోగపడుతున్నాయి. చెవిటి వారి మానవ హక్కుల పరిరక్షణతో పాటు వారికి సమాజం సహానుభూతితో చేయూత ఇవ్వడం, వినికిడి పరికరాలను ఉచిత వితరణ జరగాలనే సదుద్దేశంతో ఈ వేదికలను నిర్వహించుకుంటారు. వినికిడి లోపంతో బాధ పడుతున్న వారికి సంఘీభావాన్ని తెలపడం, వారి హక్కులను పరిరక్షించడం, నిధులను సేకరించడం, పేద చెవిటి వారికి వినికిడి పరికరాలను అందించడం, సమాజంలో వివక్షకు దూరంగా సామాన్యులతో సమానంగా చూడడం, అంగవైకల్యం శరీరానికేగాని మనసుకు, సామర్థ్యానికి కాదనే నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్పించాలి.

డబ్ల్యూహెచ్ఓ అంచనాల ప్రకారం 2050 నాటికి 5 శాతం ప్రజలు, అనగా 700 మిలియన్ల ప్రపంచ ప్రజలు వినికిడి సమస్యలతో బాధ పడతారని, వయోవృద్ధుల్లో 25 శాతం చెవిటితనం ఉండవచ్చని తెలుస్తున్నది. వినికిడి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, బదిరులకు సహాయం చేస్తూ, అంగవైకల్య ప్రజలను జనజీవన స్రవంతిలో కలుపుకొని పోవాలని కోరుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# దేశవ్యాప్త ప్రచారం నిర్వహిస్తున్న భారత తీరరక్షక దళం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్వచ్ఛ భారత్ అభియాన్'కు అనుగుణంగా, ఈరోజు అన్ని తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో భారత తీరరక్షక దళం (ఐసీజీ) అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రతా దినోత్సవం 2024 (ఐసీసీ-2024)ని నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణ పట్ల భారత యువతలో పెరుగుతున్న నిబద్ధతను చాటుతూ దేశవ్యాప్తంగా ఎన్‌సీసి క్యాడెట్‌లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాఠశాల, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు, మునిసిపల్ కార్పొరేషన్లు, ప్రభుత్వేతర సంస్థలు, మత్స్యకారుల సంఘాలు, ఓడరేవులు, చమురు ఏజెన్సీలు, ఇతర ప్రైవేట్ సంస్థల గణనీయ సహకారంతో ఐసీసీ-2024 ప్రచారం దేశవ్యాప్తంగా నిర్వహించారు. ఈ ఐక్య ప్రయత్నం సముద్ర సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ పట్ల వారి అంకితభావాన్ని చాటింది.

ఈ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలందరూ దేశంలోని తీరప్రాంతాల్లో చెత్తను, వ్యర్థాలను తొలగించడమే కాకుండా, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సముద్ర పర్యావరణ వ్యవస్థ ఆవశ్యకతను ప్రచారం చేశారు. భౌతిక శుభ్రతతో పాటు, సుస్థిరమైన పద్ధతులు, సముద్ర జీవులపై కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావం గురించి ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం, దక్షిణాసియా సహకార పర్యావరణ కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా సెప్టెంబరు మూడో శనివారం నిర్వహించే ఐసీసీ డే ఒక కీలకమైన పర్యావరణ కార్యక్రమంగా కొనసాగుతున్నది. సమాజ భాగస్వామ్యాన్ని, పర్యావరణపరమైన నాయకత్వ భావనను పెంపొందించే లక్ష్యంతో భారత తీర రక్షక దళం ఆధ్వర్యంలో 2006 నుంచి మన దేశంలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు

# లావాదేవీ ఛార్జీ విధించినట్లయితే యూపిఐ ఉపయోగించడం మానేస్తాం

**–లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడి**

న్యూఢిల్లీ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సేవపై ఏదైనా లావాదేవీ ఛార్జీ విధించినట్లయితే దాదాపు 75 శాతం మంది యూపిఐ వినియోగదారులు దానిని ఉపయోగించడం మానేస్తారని లోకల్ సర్కిల్స్ ఆదివారం నిర్వహించిన సర్వేలో పేర్కొంది. 38 శాతం మంది వినియోగదారులు తమ చెల్లింపు లావాదేవీలలో 50 శాతానికి పైగా డెబిట్, క్రెడిట్ లేదా ఏదైనా ఇతర డిజిటల్ లావాదేవీలకు బదులుగా యుపిఐ ద్వారా చేస్తున్నా రని సర్వే కనుగొంది."సర్వేలో పాల్గొన్న 22 శాతం యుపిఐ వినియోగదారులు మాత్రమే చెల్లింపులపై లావాదేవీ రుసుమును భరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు, 75 శాతం మంది ప్రతివాదులు లావాదేవీ రుసుమును ప్రవేశపెడితే యుపిఐని ఉపయోగించడం ఆపివేస్తామని చెప్పారు" అని సర్వే తెలిపింది.మూడు విస్తృత ప్రాంతాలతో కూడిన సర్వే 308 జిల్లాల నుండి 42,000 ప్రతిస్పందనలను పొందినట్లు పేర్కొంది, అయితే ప్రతి ప్రశ్నకు ప్రత్యుత్తరాల సంఖ్య భిన్నంగా ఉంటుంది. యుపిఐ లావాదేవీ రుసుముకు సంబంధించిన ప్రశ్నలకు 15,598 ప్రతిస్పందనలు వచ్చాయి. సర్వేను ఆన్‌లైన్‌లో జూలై 15 నుంచి సెప్టెంబర్ 20 మధ్య నిర్వహించారు.

## పొగాకు-రహిత విద్యాసంస్థల ఆశయ సాకారం కోసం

# రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రభుత్వాలకు సూచనలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : పొగాకు బారి నుంచి యువతను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్రాలకూ, కేంద్ర పాలిత ప్రభుత్వాలకూ విద్యాశాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు ఒక కరదీపిక రూపంలో సంబంధిత మార్గదర్శకాలను అందించాయి. రెండు మంత్రిత్వ శాఖలూ ఉమ్మడిగా ఈ నిర్ణయం తీసుకున్నాయి. విద్యాసంస్థల్లో పొగాకు వాడకాన్ని నిరోధించే ఉద్దేశంతో 'కోట్పా' (సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం)-2003 నిబంధనలకు లోబడి 'టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (టీఓఎఫ్ఈఐ)' పేరుతో రూపొందిన నియమావళిలోని అంశాలను కఠినంగా అమలు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ తాజాగా కేంద్రం సూచించింది.

పాఠశాల విద్య, ఉన్నత విద్యా విభాగాల కార్యదర్శులూ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శీ ఈ సూచనా పత్రంపై సంతకాలు చేశారు. బాలురు, కౌమార దశలోని పిల్లలపైనా పొగాకు చూపే తీవ్ర దుష్ప్రభావాలని ఈ ఉమ్మడి నియమావళి ఎత్తిచూపింది. 'గ్లోబల్ యూత్ టొబాకో సర్వే- 2019'ని ఉటంకిస్తూ, మన దేశంలో 13-15 ఏళ్ల లోపు విద్యార్థుల్లో 8.5 శాతం మంది పొగాకును ఏదో ఒక రూపంలో వాడుతున్నారని పేర్కొంది. వీరిలో దాదాపు 5,500 మంది పొగాకును ప్రతి రోజూ తీసుకోవడం ఆందోళన కలిగించే అంశమని చెప్పింది. జీవితాంతం పొగాకు వాడకానికి అలవాటు పడ్డ 55 శాతం మందికి ఈ దురలవాటు 20 సంవత్సరాలలోపే ఏర్పడుతుందని, దరిమిలా ఇటువంటి వారు ఇతర మత్తు పదార్థాలకి బానిసలుగా మారడాన్ని గమనించవచ్చని తెలిపింది.

యువతను పొగాకు అలవాటు నుండి దూరంగా ఉంచేందుకు, వారి సంక్షేమం పట్ల ఆసక్తి కలవారందరూ కలిసికట్టుగా పనిచేయాలని నియమావళి పిలుపునిచ్చింది. పొగాకు దుష్ప్రభావాల గురించి అవగాహన పెంపొందించడం, విద్యా సంస్థల్లో పొగాకును కట్టడి చేయడం ద్వారా భవిష్యత్తు తరాలను కాపాడుకోవడం ఈ యత్నం లక్ష్యం.

మైనర్లు, యువతను పొగాకు, ఎలక్ట్రానిక్ సిగరెట్ల వాడకం నుంచి పరిరక్షించాలనే ఉద్దేశంతో, జాతీయ పొగాకు నివారణ కార్యక్రమం (ఎన్‌టిసిపి)లో భాగంగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పొగాకు-రహిత విద్యాసంస్థల కోసం ఈ ప్రత్యేక మార్గదర్శక సూత్రాలను విడుదల చేసింది. 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' నాడు, ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధి సంఘం ? 'సీడ్స్' సహకారంతో మార్గదర్శకాల అమలుకు సంబంధించిన కరదీపికను విడుదల చేసింది. కరదీపికలోని అంశాలను పాటించేందుకు, 2024 మే నెల 31న అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రభుత్వ విభాగం చిరు పుస్తకాలను పంపిణీ చేసింది. విద్యాసంస్థల్లో పొగాకు వ్యతిరేక చర్యల సమర్థవంతమైన అమలుకు, ఈ కరదీపిక దిక్సూచి వంటిది.

ఇందులో పేర్కొన్న ముఖ్యోద్దేశాలు:

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, వారి సంక్షేమాల దృష్ట్యా అన్ని స్థాయిల్లో- పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థల్లో మార్గదర్శకాల్లో పేర్కొన్న సూత్రాలను పాటించాలంటూ కేంద్ర ప్రభుత్వం పంపిన లేఖలో పేర్కొన్నారు.అందరి సహకారం తోడ్పాటుతో పాఠశాల విద్యార్థులు, భవిష్యత్తరాలలో పొగాకు వాడకాన్ని తగ్గించడం, వారు దుర్వ్యసనాల బారిన పడకుండా కాపాడడం ప్రభుత్వ లక్ష్యం. విద్యాసంస్థల్లో ఈ చర్యలు సజావుగా అమలయ్యే విధంగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల సహకారంతో పని చేయాలని కేంద్ర విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు సంకల్పించాయి.

# వాయుసేన నూతన అధిపతిగా ప్రస్తుత వైస్ చీఫ్, ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నియామకం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : వాయుసేనలో వైస్ చీఫ్ గా విధులు నిర్వహిస్తున్న పరమ విశిష్ఠ, అతి విశిష్ఠ సేవా పతకాలు పొందిన (పివిఎస్ఎం/ఎవిఎస్ఎం), ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ను వాయుసేన నూతన అధిపతిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వును అనుసరించి, ఎయిర్ చీఫ్ మార్షల్ గా సెప్టెంబర్ 30 మధ్యాహ్నం నుంచి సింగ్ బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుత వాయుసేన అధిపతి, పివిఎస్ఎం/ఎవిఎస్ఎం/ విఎమ్/ఎడిసి పతకాలు పొందిన ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌధరి సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేస్తారు.

అక్టోబర్ 27, 1964 లో జన్మించిన ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, భారతీయ వాయు సేనలోకి 1984, డిసెంబర్ లో యుద్ధ పైలెట్ గా అడుగుపెట్టారు.

వాయుసేన ద్వారా దేశానికి అందించిన 40 ఏళ్ళ సుదీర్ఘ విశిష్ఠ సేవలో భాగంగా ఆయన కమాండ్, సిబ్బంది వ్యవహారాలు, బోధన, విదేశీ విభాగాల్లో బాధ్యతలు నెరవేర్చారు.

నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్, నేషనల్ డిఫెన్స్ కాలేజీల్లో శిక్షణనందుకున్న అమర్ ప్రీత్ సింగ్ అటు ప్రయోగాత్మక టెస్ట్ పైలట్, వైమానిక శిక్షకులే కాక, వివిధ రకాల విమానాలను నడపడంలో 5000 గంటలకు పైగా అనుభవం కలవారు.

విధుల్లో భాగంగా ఫ్రంట్ లైన్ ఎయిర్ బేస్, వైమానిక యుద్ధ దళాలకు నేతృత్వం వహించారు.

టెస్ట్ పైలట్ హోదాలో రష్యా రాజధాని మాస్కోలో మిగ్-29 అప్గ్రేడ్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ బృందానికి నాయకత్వం వహించారు. నేషనల్ ఫ్లైట్ టెస్ట్ కేంద్రంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ గా విధులు నిర్వహించిన సమయంలో తేజస్ తేలికరకం యుద్ధ విమానాన్ని పరీక్షించే కీలక బాధ్యతని స్వీకరించారు.

సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్ దళంలో ఎయిర్ డిఫెన్స్ కమాండర్, ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ దళ సీనియర్ ఎయిర్ స్టాఫ్ అధికారిగా ముఖ్యమైన హోదాల్లో సేవలందించారు. వాయుసేన వైస్ చీఫ్ గా బాధ్యతలు చేపట్టక మునుపు, అమర్ ప్రీత్ సింగ్ సెంట్రల్ ఎయిర్ కమాండ్ లో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ గా సైతం విధులు నిర్వర్తించారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ముగిసిన శాంతి హోమం



తిరుపతి, సెప్టెంబర్ 23 : లడ్డూ ప్రసాదాలు, ఇతర నైవేద్యాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయం లోని బంగారు బావి చెంతగల యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి, శాంతి హోమాలను టీటీడీ నిర్వహించింది. శాంతి హోమం ముగిసిన అనంతరం ఆలయం వెలుపల టీటీడీ ఈవో జె శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆలయంలో ఉదయం 6 నుండి 10 గంటల వరకు రుత్వికులు వాస్తు శుద్ధి, కుంభజాల సంప్రోక్షణ నిర్వహించారన్నారు. ఈ శాంతి హోమం ద్వారా భక్తులు లడ్డూ ప్రసాదం మరియు నైవేద్యం నాణ్యతపై తమకున్న భయాలను మరియు అపోహలను పక్కన పెట్టవచ్చు అన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు మాట్లాడుతూ, యాగశాలలో సంకల్పం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు హోమం, కుంభప్రతిష్ట, పంచగవ్య ఆరాధన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

పూర్ణాహుతి అనంతరం కుంభ ప్రోక్షణ నిర్వహించి విశేష నైవేద్యం కూడా సమర్పించినట్లు చెప్పారు. ఇక నుంచి లడ్డూ ప్రసాదాలు, నైవేద్యాలకు ఎలాంటి దోషాలు ఉండవని, భక్తులు సంతోషంగా స్వీకరించవచ్చని తెలిపారు.

సాయంత్రం 6 గంటలకు శ్రీవారి భక్తులు తమ ఇంటిలో దీపారాధన చేసే సమయంలో, క్షమా మంత్రాలైన. "ఓం నమో నారాయణాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో వేంకటేశాయ" లను పఠించి శ్రీవారి అనుగ్రహం పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ప్రధానార్చకులు గోవిందరాజ దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, ఆగమ సలహాదారు రామకృష్ణ దీక్షితులు, సీతారామ దీక్షితులు, వేదపారాయణదారులు, రుత్వికులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలంక తదుపరి అధ్యక్షుడిగా దిస్సనాయకే!

కొలంబో సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్నాయి. ఇప్పటి వరకు విడుదలైన ట్రెండ్స్ ప్రకారం నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) నేత అనుర కుమార దిస్సనాయకే (55) ముందంజలో ఉన్నారు. ఆయనే కనుక విజయం సాధిస్తే తొలి వామపక్ష దేశాధినేతగా రికార్డులకెక్కుతారు. ప్రస్తుతం ఉన్న లీడ్స్ ఇలాగే కొనసాగితే దిస్సనాయకే శ్రీలంక 9వ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడిగా నేడు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఇటీవల దేశంలో సంభవించిన ఆర్థిక సంక్షోభం తర్వాత జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నిక కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, ప్రతిపక్ష నేత, సమగి జన బలవేగయ (ఎస్‌జెబి)కి చెందిన నేత సజిత్ ప్రేమదాస, జనతా విముక్తి పేరమున పార్టీకి చెందిన మార్క్సిస్ట్ నేత, అనుర కుమార దిస్సనాయకే సహా మొత్తం 39 మంది అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడ్డారు.

# శాంతి హోమంతో లడ్డూ దోషాలు తొలిగాయి.. టీటీడి ఈ వో



తిరుపతి, సెప్టెంబర్ 23 : శ్రీవారి ఆలయంలో జరిగిన దోషాలకు ప్రాయశ్చిత్తంగా శాంతి హోమం చేసినట్లు టిటిడి ఈవో శ్యామలరావు తెలిపారు. ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నేడు నిర్వహించారు. ఈ కార్యక్రమాల అనంతరం ఈవో, ఆలయ అర్చకులు మీడియాతో మాట్లాడారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. స్వామి వారికి మహా నైవేద్యం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లో ప్రోక్షణ చేస్తున్నామన్నారు. దోషం కలిగిందన్న భావన లేకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చివరిగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగుతాయని తెలిపారు. భక్తులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. . పవిత్రోత్సవాల ముందు జరిగిన దోషం.. పవిత్రోత్సవాలతో పోయిందని అన్నారు. మార్చిన నెయ్యితోనే ప్రసాదాలు తయారు చేశామని చెప్పారు.శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిశాయనే వార్తలు ఇటీవల పెద్ద దుమారం రేపాయి. ఈ క్రమంలో జరిగిన మహా పాపానికి పరిహారంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహించారు.

# నంబూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవన్ ప్రాయశ్చిత్త దీక్ష

**-11 రోజుల తర్వాత తిరుమల వెళ్లి శ్రీవారి దర్శనం**
**-సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనన్న పవన్**

గుంటూరు సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జిల్లా నంబూరులో కొలువై ఉన్న శ్రీ దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దీక్ష ప్రారంభించారు. విచ్చలవిడి మనస్తత్వం ఉన్నవాళ్లే తిరుమల లడ్డూ కల్తీకి పాల్పడగలరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ అంశం ప్రజా పోరాటంలో ఉన్న తన దృష్టికి రాకపోవడం బాధ కలిగించిందని, తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నాయని తెలిసిన తర్వాత మనసు కలత చెందిందని తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి పట్ల ఇది నిజంగా ఘోర అపచారం అని, సనాతన ధర్మాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ దీనికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ఈ క్రమంలో తాను 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపడుతున్నానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. గుంటూరు జిల్లా నంబూరులో కొలువై ఉన్న శ్రీ దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దీక్ష ప్రారంభించారు. 11 రోజుల దీక్ష అనంతరం తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటానని పేర్కొన్నారు. టీటీడీ ఉద్యోగులు గత

# మహారాష్ట్రలోని పుణేలో రెండు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : మహారాష్ట్రలోని పుణేలో రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులకు కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర పౌర విమాన యాన, సహకార శాఖల సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మొహోల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ రహదారి 965 (పాల్కీ మార్గ్ ప్యాకేజీ 6)లోని మొహోల్- అలండి సెక్షన్లో డైవ్ ఘాట్ నుండి హడప్సర్ వరకు 13 కిలోమీటర్ల రెండు వరసల మార్గాన్ని నాలుగు లేన్లుగా మార్చే ప్రాజెక్టుకు, ములా-ముతా నదిపై ప్రధాన వంతెనల నిర్మాణంతో పాటు జాతీయ రహదారి 48 లోని పూణే-సతారా సెక్షన్లో సింహగడ్ రోడ్ నుండి వార్జే వరకు సర్వీస్ రోడ్ల నిర్మాణం ప్రాజెక్టుకు శ్రీ గడ్కరీ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా శ్రీ నితిన్ గడ్కరీ మాట్లాడుతూ ఎన్ హెచ్ -965లోని దువే ఘాట్ సెక్షన్ వరకు రహదారిని వెడల్పు, అభివృద్ధి చేయడం వల్ల ఈ సెక్షన్లో రద్దీ గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఇంకా ఇది పాల్కీ యాత్రకు వెళ్లే వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని అందిస్తుందని తెలిపారు.. పాల్కీ యాత్ర మార్గాల వెంబడి ఉన్న విశ్రాంతి స్థలాలను ఎంఎస్ఐడీసీ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు.

ములా, ముతా నదిపై ప్రధాన వంతెనల నిర్మాణం, నార్హే నుంచి నవలే బ్రిడ్జి వరకు సర్వీస్ రోడ్డు వెడల్పుతో పాటు సింహగఢ్ రోడ్డు నుంచి వార్జే వరకు కలపడం వల్ల ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని చెప్పారు.

రూ.7500 కోట్ల విలువైన ఎన్ హెచ్ 60లోని నాసిక్ ఫాటా ఖేడ్ సెక్షన్లో ఎలివేటెడ్ కారిడార్ కోసం కూడా జాతీయ రహదారుల సంస్థ టెండర్ ను ఆహ్వానించిందని ఆయన తెలిపారు.

రూ.5 వేల కోట్లతో రావెట్ నుంచి నార్హే ఎలివేటెడ్ కారిడార్ అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) పూర్తయిందని, 2024 డిసెంబర్-2024లో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని శ్రీ గడ్కరీ తెలిపారు. జాతీయ రహదారి-548డిలోని తలేగావ్ చకన్ శిక్రాపూర్ సెక్షన్, జాతీయ రహదారి- 753 ఎఫ్ లోని పుణె-షిరూర్ సెక్షన్ ఎలివేటెడ్ కారిడార్లను ఎంఎస్ఐడిసి అభివృద్ధి చేస్తుందని చెప్పారు. రెండు నగరాలను కలుపుతూ ముంబయి, పుణే, బెంగళూరు నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు న్యూ ముంబై - బెంగళూరు ఎక్స్ ప్రెస్ వేకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) ను రూపొందించినట్లు తెలిపారు.

పుణే, సతారా, షోలాపూర్ లను కలపడం వల్ల విఠల్ స్వామి పవిత్ర ఆలయానికి వెళ్లే భక్తులకు సున్నితమైన ప్రయాణాన్ని అందించడం ఈ ప్రాజెక్టుల లక్ష్యం. ఇంకా, ఈ విస్తరణ ప్రాజెక్టులు ప్రయాణాన్ని వేగవంతం, సులభతరం చేస్తాయి.

# విషాదంగా విహార యాత్ర... జలపాతంలో ముగ్గురు మెడికోలు దుర్మరణం



అమరావతి, సెప్టెంబర్ 23 : జలపాతంలో దిగి సరదాగా ఈత కొడుతున్న విద్యార్థులు కళ్లముందే కొట్టుకుపోయారు.. ఉన్నట్టుండి నీటి ప్రవాహం పెరగడంతో గల్లంతయ్యారు. తోటి విద్యార్థులు అతికష్టమ్మీద ఇద్దరిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాజమండ్రిలోని పర్యాటక ప్రదేశం మారేడుమిల్లిలో ముగ్గురు వైద్యవిద్యార్థులు గల్లంతయ్యారు. అందులో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలను అధికారులు సోమవారం ఉదయం నీటి లోంచి బయటకు తీశారు.. గల్లంతైన మరో విద్యార్థి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి.

విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు ఆశ్రమ వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఆదివారం మారేడుమిల్లికి విహారయాత్రకు వచ్చారు. అందరూ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఇందులో పదిమంది అమ్మాయిలు కాగా నలుగురు అబ్బాయిలు ఉన్నారు. మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతంలో విద్యార్థులు సరదాగా ఈత కొట్టారు. ఈ క్రమంలోనే భారీ వర్షం కురవడంతో జలపాతంలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో నీళ్లలో ఉన్న సీహెచ్ హరదీప్, కే సౌమ్య, బీ అమృత, హరిణిప్రియ, గాయత్రి పుష్ప ప్రవాహంలో కొట్టుకుపోయారు.

ఇది గమనించి మరికొందరు విద్యార్థులు నీళ్లలోకి దిగి హరిణిప్రియ, గాయత్రిపుష్పలను అతికష్టమ్మీద ఒడ్డుకు చేర్చారు. వారిని హుటాహుటిన రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు. మిగతా ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోయిన విషయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా రంగంలోకి దిగి విద్యార్థుల కోసం గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం పార్వతీపురం జిల్లా బొబ్బిలికి చెందిన సౌమ్య, బాపట్లకు చెందిన అమృత మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మరో యువకుడు హరదీప్ ఆచూకీ ఇంకా దొరకలేదని వివరించారు. కాగా, హరిణిప్రియ పరిస్థితి సీరియస్ గా ఉండడంతో రంపచోడవరం ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

# ఆర్మీ సిబ్బందితో వెళుతున్న ప్రత్యేక రైలును పేల్చివేసే కుట్ర

## -రైల్వే ట్రాక్‌పై ఏకంగా 10 డిటోనేటర్లను అమర్చిన దుండగులు
## -మరో చోట రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్



మధ్యప్రదేశ్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఆర్మీ సిబ్బందితో వెళుతున్న ప్రత్యేక రైలును పేల్చివేసే కుట్ర జరిగింది. రైల్వే ట్రాక్‌పై ఏకంగా 10 డిటోనేటర్లను దుండగులు అమర్చారు. అయితే అదృష్టం కొద్దీ ఎలాంటి నష్టం జరగకుండానే కుట్ర భగ్నమైంది. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లాలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సైన్యానికి చెందిన ప్రత్యేక రైలు జమ్మూకశ్మీర్ నుంచి కర్ణాటకకు వెళుతున్న సమయంలో సగ్‌ఫాటా రైల్వే స్టేషన్ సమీపంలో ఈ డిటోనేటర్లను గుర్తించారు. ఒక డిటోనేటర్ పేలడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ట్రైన్‌ను ఆపాడు. దీంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ వెంటనే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు. యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటిఎస్), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రైల్వే, స్థానిక పోలీసు సీనియర్ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టారు.

ఇదిలావుండగా ఉత్తరప్రదేశ్‌లో ఒక చోట రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్‌ను రైల్వే భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇవాళ (ఆదివారం) తెల్లవారుజామున రాష్ట్రంలోని కాన్పూర్‌లో ఉన్న ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు పట్టాలపై ఈ సిలిండర్‌ను గుర్తించారు. అది ఖాళీ గ్యాస్ సిలిండర్ అని నిర్ధారించారు. ట్రాక్‌పై సిలిండర్‌ను గుర్తించిన వెంటనే గూడ్స్ రైలు లోకో పైలట్ అత్యవసర బ్రేకులు వేసి ట్రైన్‌ను ఆపాడు. ఉదయం 8:10 గంటల సమయంలో ట్రైన్ కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్ వైపు వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. 5 కేజీల గ్యాస్ సిలిండర్‌ను ట్రాక్‌పై ఉంచారని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. కాగా ఉత్తరప్రదేశ్‌లో ఈ తరహా ఘటన జరగడం ఈ నెలలో రెండవసారి కావడం గమనార్హం.

# రెచ్చిపోవద్దు.. ఏపిలో అధికారులకు పట్టిన గతే మీకూ తప్పదు -హరీశ్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతం కాదని, అధికారులు రెచ్చిపోవద్దని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు..తెలంగాణ భవన్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, ఏపీలో గత ప్రభుత్వంలో అధికారులు రెచ్చిపోయారని,ప్రభుత్వం మారిన వెంటనే వారందరేఊ సస్పెండ్ అవుతున్నారని ప్రస్తావించారు. అధికారంలో ఉన్నామని రెచ్చిపోతే అక్కడి అధికారులకు పట్టిన గతే మీకూ పడుతుందన్నారు. తమపై దాడులు చేసిన వారిపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు" అని గుర్తు చేశారు.

రాష్ట్రంలో నీళ్ల లేక పంటలు ఎండుతున్నాయని, అది ప్రకృతి తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరవని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పక్కనే నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా ఉన్నా రైతులకు పూర్తిగా సాగునీరు అందకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా లో నీళ్ల లేక పంటలు ఎండుతున్నాయని ఆరోపించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ఆ జిల్లాకు ఇలాంటి దుస్థితి రావడం దురదృష్టకరమని తెలిపారు. జిల్లాకు వచ్చే సాగర్ కాలువ కు గండి పడి 22 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఆ గండిని సరిగా పూడ్చకపోవడం ఏంటని ప్రశ్నించారు. పక్కా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆరోపించారు.

### సాగునీరు ఇచ్చేందుకు చేతకాదా..

గతేడాది ప్రకృతి తెచ్చిన కరువైతే.. ఈ ఏడాది కాంగ్రెస్ కరువును తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. రైతులకు కనీసం సాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వానికి చేతకాదా అని ప్రశ్నించారు. ఓ వైపు నీళ్ల లేక పంటలు ఎండుతుంటే హైదరాబాద్ నగరంలో నిరుపేదల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. రైతులు కన్నీళ్లు పెట్టకుండా చూడాలనే సోయి ఉండాలి కాదా అని ప్రశ్నించారు. వరదల్లో నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. సర్కార్ నిర్వాకం వల్లే సుమారు లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ధ్వజమెత్తారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులతో పాటే.. సాగర్ ఆయకట్టులో నీరందక పంట ఎండిన పొలాలకు కూడా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కావాలనే తన ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి - ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

## -ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి
## -దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్
## -దాడిని ఖండించిన కెటిఆర్,హరీష్ రావు



మెదక్,సెప్టెంబర్ 23 : కాంగ్రెస్ కార్యకర్తలు కావాలనే తమ ఇంటి ముందు టపాసులు పేల్చారని, లోపలకు వచ్చి ఇద్దరిపై దాడి చేశారని, ఇది కావాలని చేసిన దాడి అని నర్సాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ? గోమారంలోని తన ఇంటిపై దాడి జరిగిందని వాపోయారు. గేటు లోపలకు వచ్చి మరీ దాడి చేశారన్నారు. మహిళా ఎమ్మెల్యే ఇంటిపై దాడులు చేయడం, కావాలని టపాసులు పేల్చడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారన్నారు.

### సునీతా లక్ష్మారెడ్డికి కెటిఆర్ ,హరీశ్ రావు పరామర్శ

సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఆమెను పరామర్శించారు. నేటి ఉదయం ఆయన హైదరాబాద్ నుంచి నర్సాపూర్‌కు వెళ్లి జరిగిన సంఘటన వివరాలను ఆమెను అడిగి తెలుసుకున్నారు. . మరోవైపు, సునీతా లక్ష్మారెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ , దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో 'భవిష్యత్ శిఖరాగ్ర సమావేశం' అనుబంధ కార్యక్రమం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : ఈ రోజు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో 'భవిష్యత్ శిఖరాగ్ర సమావేశానికి' అనుబంధంగా జరిగిన కార్యక్రమంలో పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి గౌరవ లీనా నందన్ ప్రసంగించారు. 'సుస్థిర భవిష్యత్ కోసం యువతకు సాధికారత: ఖచ్చితమైన పరివర్తన కోసం తరతరాలపై ఉన్న బాధ్యత, నైపుణ్యాలు' అనే అంశంపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది.

ప్రసంగం ప్రారంభంలో లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్-ఎల్ఐఈఎఫ్)కు సంబంధించి రెండు నిమిషాల నిడివి గల వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. వాతావరణ మార్పు అనే సవాలును పరిష్కరించడానికి భారత్ అనుసరిస్తోన్న బహుముఖ విధానానికి సంబంధించిన తాత్వికత, నిజమైన స్ఫూర్తిని తెలిపే విధంగా ఈ రెండు నిమిషాల వీడియో ఉందని అన్నారు. కాప్-26లో భారత ప్రధాని ప్రకటించిన కీలక వ్యూహాల్లో మిషన్ లైఫ్ కూడా ఒకటని తెలిపారు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సమక్షంలో 2022 అక్టోబర్‌లో ప్రపంచవ్యాప్తంగా మిషన్ లైఫ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ నాయకత్వంలో మిషన్ లైఫ్ దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా అమలవుతోంది.

పర్యావరణ అనుకూల పద్ధతులు, స్థిరమైన జీవనశైలిని అవలంబించే విధంగా మన రోజువారీ ప్రవర్తనలో మార్పును మిషన్ లైఫ్ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. సుస్థిర వినియోగ పద్ధతులను జీవితంలోకి తీసుకురావటం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యం-12 విషయంలో మిషన్ లైఫ్ గణనీయమైన పురోగతిని సాధించగలదని అన్నారు.

భారత్ ప్రతిపాదించిన క్లైమేట్ యాక్షన్ తీర్మానానికి బొలీవియా, శ్రీలంకల నుంచి మద్దతు లభించిందని ఆమె తెలిపారు. ఇది ఇచ్చిన ఊపుతోనే, 2024 మార్చి 1న నైరోబీలో జరిగిన ఆరో సమావేశంలో ఐక్యరాజ్యసమితి పర్యావరణ అసెంబ్లీ సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించే తీర్మానాన్ని ఆమోదించిందని పేర్కొన్నారు. మిషన్ లైఫ్ కార్యచరణను అమలు చేయడం వల్ల 2030 నాటికి ప్రపంచ గ్రీన్ హౌస్ ఉద్గారాలను ఏటా 2 బిలియన్ టన్నులు తగ్గించవచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా వేసిందని అన్నారు.

తరాల మధ్య అంతరం లేకుండా చూసుకునేందుకు నేటి పిల్లలు, యువత చాలా అవసరమని ఆమె ప్రధానంగా చెప్పారు. న్యాయమైన పరివర్తనకు అవసరమైన నైపుణ్యాలు, సాధనాలతో వారిని సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

జనాభాలో దాదాపు 28 శాతం ఉన్న మన యువత హరిత ఆర్థిక వ్యవస్థకు పరివర్తన చెందడానికి కావాల్సిన గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉన్నారని ఆమె వివరించారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా.. సుస్థిర, సమ్మిళిత వృద్ధిని సాధించడానికి ఈ జనాభా డివిడెండ్ అవసరమని భావిస్తున్నట్లు తెలిపారు.

హరిత నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, హరిత ఉద్యోగాల కోసం నైపుణ్య శిక్షణ కౌన్సిల్ (స్కిల్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ జాబ్స్-ఎస్‌సీజీజే)లతో పాటు భారతదేశ నూతన విద్యావిధానం.. హరిత ఉద్యోగాల విషయంలో పెరుగుతున్న డిమాండ్‌కు సంబంధించి సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుందని అన్నారు.

భారతదేశంలో హరిత ఇంధన పరివర్తన వల్ల 30-35 మిలియన్ల కొత్త ఉద్యోగాలను సృష్టించొచ్చని 2047కి సంబంధించి ఎస్‌సీజీజే దార్శనికత అంచనా వేస్తోందని ఆమె పేర్కొన్నారు. యువతకు సాధికారత కల్పించడం, నైపుణ్యాలను సమకూర్చడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా హరిత ఉద్యోగాలను సృష్టించాలని అంతర్జాతీయ సౌర కూటమి, ప్రపంచ జీవ ఇంధన కూటమి వంటివి లక్ష్యంగా పెట్టుకున్నాయి. సుస్థిర వినియోగం, ఉత్పత్తికి సంబంధించిన జీవన శైలిని ప్రోత్సహించడం కోసం దేశం తీసుకుంటున్న చర్యలను గురిస్తూ.. యూఎన్ఈపీకి చెందిన 10 ఏళ్ల ప్రాథమిక కార్యాచరణ పథకాల (10వైఎఫ్‌పీ) బోర్డులో రెండు సంవత్సరాల పాటు పాల్గొనేందుకు భారత్ నామినేట్ అయిందని తెలిపారు.

మిషన్ లైఫ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఉటంకించారు. " తరుచుగా ఉద్గారాల తగ్గింపు వాదనకే మన చర్చలు పరిమితం అవుతుంటాయి. కానీ కేవలం నిర్ణయాలను ఇతరులపై రుద్దకుండా సరైన పరిష్కారాలను అందిస్తే మనం విజయం సాధించే అవకాశం ఉంది. ఇదే కారణంతో జీవనశైలిలో మార్పు కోసం పిలుపునిస్తున్నాను. ఎందుకంటే, మనం కోరుకునే ఉద్గారాల తగ్గింపు మనం ఎలా జీవిస్తాం, పనిచేస్తాం అనే దాని ఫలితంగా ఉంటుంది." అని అన్నారు.

స్వంత తల్లి, భూమాత పట్ల ప్రేమ, గౌరవానికి చిహ్నంగా మొక్కలను నాటడంలో భారత్‌తో పాటు ప్రపంచ పౌరులను ఇందులో భాగస్వాములుగా చేయడానికి ఉద్దేశించిన "ఏక్ పేడ్ మా కే నామ్" లేదా "తల్లి కోసం చెట్టు నాటటం" కార్యక్రమాన్ని ప్రారంభించడంలో.. ప్రధాని మోదీ దూరదృష్టిని వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమం కింద జూన్ 5 నుంచి సెప్టెంబర్ 17 మధ్య భారతదేశంలో 75 కోట్లకు పైగా చెట్లను నాటామని, అంటే రోజుకు 70 లక్షల చెట్లని ప్రకటించారు.

ఈ రోజు మనం తీసుకునే నిర్ణయాలు భూగోళానికి ప్రయోజనం చేకూర్చడమే కాకుండా మన పిల్లలు, యువత భవిష్యత్తుకు ముఖ్యమని గుర్తించి అందరూ కలిసి ముందుకు సాగాలని ఆమె కోరారు.

## ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతా వ్యవస్థలను బలోపేతం చేద్దాం

# ప్రతిజ్ఞతో ముగిసిన రెండు రోజుల గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సమ్మిట్ 2024

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : భారత్ మండపంలో జరిగిన రెండు రోజుల గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సమ్మిట్ 2024 ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం కేంద్ర ఆహార ఉత్పత్తి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ చిరాగ్ పాశ్వాన్ ప్రసంగించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్వహించిన ఈ సదస్సులో ఆహార భద్రత, నియంత్రణ అంశాలపై అంతర్జాతీయ సహకారం, పరస్పర విజ్ఞాన బదిలీ పెంపొందించడానికి ఉద్దేశించిన లోతైన సంభాషణలు, చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా శ్రీ చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ ఆహార రక్షణతో పాటు ఆహార భద్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన ఆహార నాణ్యతను కాపాడుకోవడమే కాకుండా దాని విలువను పెంచే మార్గాలను అన్వేషించే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ ఆహార నియంత్రణ సంస్థలు, ఇతర భాగస్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్న అంతర్జాతీయ సదస్సును నిర్వహించినందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐని శ్రీ పాశ్వాన్ అభినందించారు. "మన ఆహార వ్యవస్థల వైవిధ్యం నిజంగా చెప్పుకోదగినది- ఇది భారతదేశపు జీవనసారం. ఈ విశాల సమృద్ధిని అర్థవంతమైన అవకాశాలుగా మార్చే మార్గాలను మేధోమథనం చేయాల్సిన అవసరం ఉందని" ఆయన అన్నారు.

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికె పాల్ తన ప్రత్యేక ప్రసంగంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈట్ రైట్ ఇండియా ఉద్యమాన్ని ప్రశంసించారు. 'మన దేశంలో ఈట్ రైట్ ఉద్యమం నడుస్తున్నందుకు నేను చాలా గర్వపడుతున్నాను. మీరంతా ఈట్ రైట్ ఇండియా జన్ ఆందోళన్ ఉద్యమంలో భాగస్వాములై ప్రవర్తనలో మార్పుకై ప్రయత్నించాలని కోరుతున్నాను."

అంతకు ముందు సమాంతర సెషన్ గా జరిగిన ప్రాంతీయ సదస్సులో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్ అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతా ప్రమాణాలను రూపొందించడంలో ప్రాంతీయ దేశాల పాత్రను ఇనుమడింపచేయడానికి దేశాల మధ్య ఐక్యత, సహకారం అవసరమని ఆమె ఉద్ఘాటించారు. మన దేశ జాతీయ ఆహార భద్రతా ప్రమాణాలను కోడెక్స్ ప్రాంత ప్రమాణాలతో అనుసంధానించడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ పోషించిన కీలక పాత్రను ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు.

కోడెక్స్ అలిమెంటరియస్ కమిషన్ ప్రమాణ-రూపకల్పన ప్రక్రియకు లోబడి సహకారం, సమన్వయాన్ని పెంపొందించడానికి ఉద్దేశించిన ప్రాంతీయ సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇచ్చింది. రోమ్ లోని కోడెక్స్ ప్రధాన కార్యాలయం వెలుపల ఒక ప్రాంతీయ సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన ఆహార భద్రత, వాణిజ్యం, నియంత్రణ సవాళ్ల గురించి చర్చించడానికి ఇది ఆసియా దేశాలకు ప్రత్యేక వేదికను అందించింది.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్ డి) కుమారి పుణ్య సలీలా శ్రీవాస్తవ కీలకోపన్యాసం చేశారు.

రెండు రోజుల ఈ సదస్సులో చోటు చేసుకున్న చర్చల సారాంశాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో శ్రీ జి.కమలా వర్ధనరావు వివరించారు. చర్చల సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు అందించిన అమూల్యమైన సహకారం, నైపుణ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రెండోరోజు సదస్సులో అవశేషాలు, కలుషితాల పర్యవేక్షణ వ్యవస్థలు, ఆహార పరీక్షలకోసం ఆధునిక విశ్లేషణ పద్ధతులు, బహిర్గతం అవ్వని ఆకలిని నిర్మూలించేందుకు పటిష్ట వ్యవస్థల నిర్మాణం, ఆహార భద్రత మానవ ఆరోగ్యంపై జంతువుల ఆహార ప్రభావం వంటి క్లిష్టమైన అంశాలపై లోతైన చర్చలు జరిగాయి. ఈ సదస్సును సెప్టెంబర్ 20 (శుక్రవారం)న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జెపి నడ్డా ప్రారంభించారు. వివిధ ఆహార భద్రతా వ్యవస్థలు, నియంత్రణ, ప్రాధమిక ప్రణాళికలకు సంబంధించిన కీలక సమస్యలపై తమతమ దృక్పథాలను, జ్ఞానాన్నిపరస్పర బదిలీ చేసుకోడానికి వీలుగా ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార నియంత్రణ సంస్థలను ఏకతాటిపైకి తెచ్చింది.

భారత సరిహద్దుల వద్ద ఆహార దిగుమతి తిరస్కరణ అప్రమత్తత కోసం ఆన్లైన్ పోర్టల్- ఫుడ్ ఇంపోర్ట్ రిజెక్షన్ అలర్ట్స్ (ఎఫ్ఐఆర్ఏ) ను , ఆహార దిగుమతి అనుమతి మంజూరు కోసం అధునాతన వెబ్ సైట్- ఫుడ్ ఇంపోర్ట్ క్లియరెన్స్ సిస్టమ్ (ఎఫ్ఐసీఎస్) 2.0 లతోపాటు అనేక నూతన కార్యక్రమాలను సదస్సు సందర్భంగా ఆవిష్కరించారు. ప్రారంభోత్సవ వేడుక సందర్భంగా 'ఫ్లేవర్స్ ఆఫ్ శ్రీ అన్నా - సెహత్ ఔర్ స్వాద్ కే సంగ్' అనే చిరుధాన్యాల వంటకం ప్రదర్శనను కూడా ఏర్పాటు చేసారు. భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రత పనితీరును మూల్యాంకనం చేసే వార్షిక నివేదిక- స్టేట్ ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్ (ఎస్ఎఫ్ఎస్ఐ) 2024 విడుదల కావడం కూడా ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

70కి పైగా దేశాలకు చెందిన ఆహార భద్రతా నియంత్రణ సంస్థలు, నష్టాల మదింపు ప్రాధికార సంస్థలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల (ఫుడ్ సేఫ్టీ రెగ్యులేటర్లు, రిస్క్ అసెస్ మెంట్ అథారిటీలు, రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ లు, యూనివర్శిటీల) ప్రతినిధులు కీలక నియంత్రణ అంశాలపై చర్చించి వ్యూహరచన చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలను పెంపొందించడంలో, ఆహార రక్షణను నిర్ధారించడంలో ప్రపంచ ప్రయత్నాలకు నాయకత్వం వహించడానికి భారతదేశం నిబద్ధతను ఇది స్పష్టం చేసింది. ఈ సదస్సు, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత విస్తారిత వ్యవస్థను ప్రభావితం చేసే ఆహార భద్రత, నష్టాల మదింపు, విశ్లేషణాత్మక బలం, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాల వంటి కీలక అంశాలపై చర్చలు ప్రారంభించింది.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమారి ఇనోషి శర్మ, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హెచ్ఐవికి టీకా వచ్చేసింది

## -హెచ్ఐవి నియంత్రణకు ఓ టీకా అభివృద్ధి చేసిన అమెరికాలోని ఎంఐటి పరిశోధకులు

హైదరాబాద్ సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రపంచంలో లక్షలాది మంది హెచ్ఐవి వైరస్ బారినపడి మరణిస్తున్నారు. ఆ వైరస్ తరచూ మ్యుటేషన్ కు గురవ్వడం వల్ల ఆ వ్యాధిని నయం చేయడం కుదరడం లేదు. ఇప్పటి వరకు అందుబాటులోకి వచ్చిన ఏడు వ్యాక్సిన్ లు కూడా అంతగా ప్రభావం చూపలేదు. ఈ నేపథ్యంలో అమెరికాలోని ఎంఐటి పరిశోధకులు తాజాగా హెచ్ఐవి నియంత్రణకు ఓ టీకాను అభివృద్ధి చేశారు. హెచ్ఐవి నియంత్రణ కోసం ఈ టీకాను వారం వ్యవధిలో రెండు మోతాదులుగా ఇస్తారు. తొలి డోసులో 20 శాతం వ్యాక్సిన్‌ను, రెండో డోసులో 80 శాతం వ్యాక్సిన్‌ను రోగికి వేస్తారు. స్వల్ప వ్యవధిలో ఇచ్చే ఈ రెండు డోసులతో వైరస్ మ్యుటేషన్ జరిగేలోగా టీకా తన పనిని ప్రారంభిస్తుందని, రోగ నిరోధక వ్యవస్థను కూడా ఉత్తేజితం చేస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు వెల్లడించారు. 'ఇంట్రెస్టింగ్ ఇంజినీరింగ్' ఈ వివరాలను వెల్లడించింది

# వ్యాపార సంస్థలు మానవ హక్కుల సమస్యల పట్ల జవాబుదారీగా ఉండాలని ప్రత్యేకంగా పేర్కొన్న ఎన్ హెచ్ ఆర్ సీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : కేరళకు చెందిన 26 ఏళ్ల మహిళా చార్టర్డ్ అకౌంటెంట్ 2024 జూలై 20న అధిక పనిభారం కారణంగా చనిపోయిందని మీడియాలో వచ్చిన వార్తలను జాతీయ మానవ హక్కుల కమిషన్ ( ఎన్ హెచ్ ఆర్ సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. మహారాష్ట్రలోని పుణేలోగల ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థలో ఆమె పని చేస్తున్నారు. నాలుగు నెలల కిందటే ఆమె ఆ సంస్థలో చేరారు. ఎక్కువ గంటలు పని చేయడం వల్ల తన కుమార్తె శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతిన్నదని ఛార్టర్డ్ అకౌంటెంట్ తల్లి ఎర్నెస్ట్ అండ్ యంగ్ కంపెనీ యాజమాన్యానికి లేఖ రాసింది. అయితే ఆ లేఖను సదరు కంపెనీ తిరస్కరించింది. ఈ ఘటనపై కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ విచారణ జరుపుతోంది.

మీడియా వార్తల్లోని విషయాలు నిజమైతే, తాము పని చేస్తున్న కంపెనీల్లో యువత నిత్యం ఎదుర్కొంటున్న సవాళ్లు, మానసిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, అసాధ్యమైన లక్ష్యాల సాధన కోసం పని చేయడం, సమయానికి పని పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేయడం తదితరాలు వారి శారీరక , మానసిక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నట్టుగా భావించాల్సి వస్తోందని కమిషన్ పేర్కొంది. ఇది వారి మానవ హక్కులకు సంబంధించి తీవ్ర ఉల్లంఘనేనని కమిషన్ తన పరిశీలనలో వివరించింది.

తమ ఉద్యోగులకు భద్రమైన, సురక్షితమైన సానుకూల వాతావరణాన్ని అందించడం ప్రతి యజమాని ప్రధాన విధి అని ఎన్ హెచ్ ఆర్ సీ వివరించింది.. ప్రతి సంస్థ తమతో పని చేసే ప్రతి ఒక్కరినీ గౌరవ మర్యాదలతో చూసుకోవాలని కోరింది.

మానవ హక్కుల సమస్యల విషయంలో వ్యాపార సంస్థలు జవాబుదారీగా ఉండాలని, ప్రపంచ మానవ హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా వారి పని, ఉపాధి విధానాలనూ, నిబంధనలను క్రమం తప్పకుండా ఆధునీకరించాలని కమిషన్ స్పష్టం చేసింది. పుణే కేసులో యువ ఉద్యోగి దుర్మరణం చెందిన నేపథ్యంలో దేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఈ విషయంలో సంబంధిత వ్యక్తులు, సంస్థలు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జాతీయ మానవహక్కుల కమిషన్ సూచించింది.

ఈ ఘటనపై వివరణాత్మక నివేదికను కోరుతూ కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖకు ఎన్ హెచ్ ఆర్ సీ నోటీసు జారీ చేసింది. యువ ఉద్యోగి మరణానికి సంబంధించిన కేసు దర్యాప్తు ఫలితాలను తెలియజేయాలని కోరింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలతోపాటు, తీసుకోవాల్సిన ప్రతిపాదిత చర్యలను కూడా తెలియజేయాలని కమిషన్ కోరింది. నాలుగు వారాల్లో కేంద్ర కార్మిక శాఖనుంచి జవాబు వచ్చే అవకాశం ఉంది.

దుర్మరణంపాలైన అమ్మాయి తల్లి తన కుమార్తె మరణంపై చేసిన ఆరోపణలు సెప్టెంబర్ 18, 2024న మీడియాలో వచ్చాయి. తన కూతురు పని చేస్తున్న సంస్థలో నెలకొన్న భారీ పని సంస్కృతి ఆమె మరణానికి కారణమని, కష్టపడి పని చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, అదే సబబనేలాగా ఒత్తిడి చేయడంవల్ల ఆ అమ్మాయి ఆరోగ్యం దెబ్బతిన్నదని తల్లి పేర్కొన్నారు.

విలువలు ,మానవ హక్కుల గురించి మాట్లాడే సంస్థ తన స్వంత ఉద్యోగి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేదని ఆ తల్లి ఆవేదన చెందినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి.

హర్యానా, తమిళనాడు రాష్ట్రాల్లోని రెండు బహుళ జాతి కంపెనీలు తమ కార్యాలయాల్లో అమలు చేస్తున్న అన్యాయమైన పద్ధతులకు సంబంధించి ఇటీవల వచ్చిన మీడియా వార్తలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఆ ఘటనల్ని సుమోటోగా తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ రెండు ఘటనలు కమిషన్ పరిశీలనలో ఉన్నాయి. వ్యాపార సంస్థలు తమ సంస్థాగత సంస్కృతిలో మానవహక్కుల సంరక్షణను, భద్రతను భాగం చేయాలని వివిధ వేదికల ద్వారా కమిషన్ సూచిస్తోంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల విషయంలో ఈ పని చేయాలని చెబుతోంది. తాము సుస్థిరంగా అమలు చేస్తున్న విధానాలనేవి ఆరోగ్యకరమైన పని వాతావరణానికీ, ఉద్యోగుల సంక్షేమానికీ దోహదం చేయాలని కమిషన్ కోరుతోంది.

మానవ హక్కులపై వివిధ సంస్థలకు ముఖ్యంగా వ్యాపార, పరిశ్రమలకు చెందిన సంస్థలకు అవగాహన కల్పించడానికి 'మానవ హక్కులు, వ్యాపార సంస్థల్లో తలెత్తే సమస్యలను సమన్వయం చేయడం'పై ఒక సమావేశాన్ని గత సంవత్సరం కమిషన్ నిర్వహించింది. వ్యాపార సంస్థల్లో మానవ హక్కుల ఉల్లంఘనకు దారి తీసే వివిధ పద్ధతులను, పని వాతావరణాన్ని పరిశీలించడానికి ప్రత్యేక మానిటర్ ని కమిషన్ నియమించింది.

వ్యాపార సంస్థల పరిస్థితులు, మానవ హక్కులకు సంబంధించి ఇప్పటికే ఉన్న చట్టాలను, నిబంధనలను సమీక్షించి, వాటి మెరుగుదల కోసం చర్యలను సూచించడానికి ప్రత్యేకంగా 'వ్యాపార సంస్థలు, మానవ హక్కులపై కోర్ గ్రూప్'ని కమిషన్ ఏర్పాటు చేసింది. కోర్ గ్రూప్ ఇచ్చే నివేదిక ఆధారంగా, కమిషన్ తన సిఫార్సులను పటిష్టం చేస్తుంది. ఆ తర్వాత వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వాటిలో భాగమైన సంస్థలకు పంపుతుంది. తద్వారా ఆయా వ్యాపారసంస్థల్లో, పరిశ్రమల్లో మానవ హక్కులు, ఆరోగ్యకరమైన పని వాతావరణం నెలకొనేలా చూస్తుంది.

# అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశం

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశమయ్యారు. డెలావేర్‌లోని బైడెన్ నివాసంలో ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.కాగా, శనివారం మోడీ అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ నెల 23 వరకు మూడు రోజులపాటు అమెరికాలో మోడీ పర్యటించనున్నారు. విల్మింగ్టన్లో జో బైడెన్ అధ్యక్షతన జరగనున్న క్వాడ్ లీడర్స్లులుగో శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొననున్నారు. ఈ సదస్సులో జోబైడెన్తోపాటు ఇతర ప్రపంచ నేతలతో మోడీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే, ఆదివారం న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితి అసెంబ్లీలో 'సమిట్‌ఆఫ్ ద ఫ్యూచర్' సదస్సులో మోడీ ప్రసంగించనున్నారు.

# విద్యానగర్, బ్లడ్ బ్యాంక్ ను సందర్శించిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



హైదరాబాద్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ శాఖా ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా నగర్, బ్లడ్ బ్యాంక్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటించారు. రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి గారు మర్యాద పూర్వకంగా శాలువ, పుష్ప గుచ్ఛం, జ్ఞాపిక తో గవర్నర్ గారిని సత్కరించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లా శాఖాలో ఒక బ్లడ్ బ్యాంక్ ను నిర్మించాలని తద్వారా పేద ప్రజలకు సేవ చేయవచ్చు అని తెలిపారు. ఇప్పటికే తలసేమియా, క్యాన్సర్ మరియు డయాలసిస్ పేషెంట్ లకు బ్లడ్ అందించడం జరుగుతుంది అని తెలిపారు. అలాగే హైదరాబాద్ జిల్లా శాఖా లో నిర్మించనున్న బ్లడ్ బ్యాంక్ కు తన వంతు పూర్తి సహకారం చేస్తానని ఈ సందర్భంగా భీమ్ రెడ్డి గారికి గవర్నర్ గారు హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా, గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, రెడ్ క్రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీరాములు ,రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ కమిటీల వైస్ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ కమిటీల సభ్యులు డాక్టర్ బి విజయ్ భాస్కర్ గౌడ్ , రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ ఎంసీ సభ్యులు డాక్టర్ ఒ. శ్రీనివాస్ రెడ్డి, రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవ పత్రం (ఫ్యాక్ట్ షీట్) : 2024 క్వాడ్ నేతల శిఖరాగ్ర సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 : సెప్టెంబర్ 21, 2024 న, అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ ఆర్ బైడెన్ డెలావేర్ లోని విల్మింగ్టన్ లో నాల్గవ క్వాడ్ నేతల శిఖరాగ్ర సదస్సు కోసం ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని కిషిడా ఫ్యూమియో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లకు ఆతిథ్యం ఇచ్చారు.

క్వాడ్‌ను మంచి కోసం ఒక ప్రపంచ (గ్లోబల్) శక్తిగా స్థాపించారు. ఈ సంవత్సరం, క్వాడ్ ముఖ్యంగా పసిఫిక్, ఆగ్నేయాసియా, హిందూ మహాసముద్ర ప్రాంతం తో సహా ఇండో- పసిఫిక్ ప్రాంతంలోని భాగస్వామ్య దేశాలకు లాభం చేకూర్చే అనేక ప్రాజెక్టులను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఇండో-పసిఫిక్ భాగస్వాముల ప్రాధాన్యాలను నెరవేర్చడానికి క్వాడ్ ఇంతకుముందెన్నడూ లేని విధంగా విస్తృతమైన పరిధి, స్థాయి లో పని చేస్తోంది. భాగస్వామ్య దేశాలు మహమ్మారులు, వ్యాధులను ఎదుర్కొనేలా సహాయపడేందుకు, ప్రకృతి విపత్తులకు స్పందించేందుకు, సముద్ర పరిధి పై అవగాహన ను, సముద్ర భద్రతను మెరుగుపరుచుకునేందుకు , అధిక ప్రమాణాలతో భౌతిక , డిజిటల్ మౌలిక వసతులను సమకూర్చుకునేందుకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముందుండి నడిపిస్తోంది. అలాగే, కీలక , నూతన ఆవిర్భావ సాంకేతికతల్లో పెట్టుబడులు పెట్టి ప్రయోజనం పొందేందుకు, వాతావరణ మార్పు ముప్పును ఎదుర్కొనేలా చర్యలు చేపట్టేందుకు, సైబర్ భద్రతను బలోపేతం చేసేందుకు చేయేందుకు , తదుపరి తరం సాంకేతిక నైపుణ్యవంతులను తీర్చిదిద్దేందుకు క్వాడ్ తన భాగస్వాములకు సహాయపడుతోంది.

గత నాలుగేళ్లలో క్వాడ్ నేతలు రెండుసార్లు వర్చువల్ గా సహా ఆరుసార్లు సమావేశమయ్యారు. క్వాడ్ విదేశాంగ మంత్రులు ఎనిమిది సార్లు సమావేశమయ్యారు, తాజాగా జూలైలో టోక్యోలో సమావేశమయ్యారు. పరస్పరం సంప్రదింపుల కోసం, భాగస్వామ్య ప్రాధాన్యతల పురోగతికి వీలుగా ఆలోచనలు పంచుకోవడానికి, ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని భాగస్వామ్య దేశాలకు ప్రయోజనాలను అందించడానికి క్వాడ్ దేశాల ప్రతినిధులు అన్ని స్థాయిల్లో నిత్య క్రమంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అన్ని క్వాడ్ ప్రభుత్వాలు క్వాడ్ ను అన్ని స్థాయిలలో , వివిధ విభాగాలు , ఏజెన్సీలలో వ్యవస్థీకృతం చేశాయి. ఈ సహకార సంప్రదాయాన్ని పటిష్టం చేయడానికి, దీర్ఘకాలం పాటు మనగలిగేలా క్వాడ్ ను ఏర్పాటు చేయడానికి క్వాడ్ నేతలు ఈ నాడు కొత్త కార్యక్రమాలను ప్రకటించారు.

ప్రతి క్వాడ్ ప్రభుత్వం దీర్ఘకాల ప్రభావం ఉండేలా తమతమ బడ్జెట్ ప్రక్రియల ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్వాడ్ ప్రాధాన్యతలకు సమృద్ధిగా నిధులను సమకూర్చడానికి కట్టుబడి ఉన్నాయి.

అంతర్-పార్లమెంటరీ మార్పిడిని, ఇతర భాగస్వాములకు క్వాడ్ సహచరులతో సంబంధాలను బలోపేతం చేయడానికి క్వాడ్ ప్రభుత్వాలు తమ తమ చట్టసభలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాయి, నిన్న, కాంగ్రెస్ సభ్యులు ద్విపక్ష, ద్విసభ్య కాంగ్రెషనల్ క్వాడ్ కూటమి (కాకస్) ఏర్పాటును ప్రకటించారు.

ఆరోగ్య భద్రత, ఆహార భద్రత, పరిశుభ్ర ఇంధనం (క్లీన్ ఎనర్జీ) , నాణ్యమైన మౌలిక సదుపాయాలతో సహా ఇండో-పసిఫిక్ లో నాలుగు దేశాలకు భవిష్యత్తు పెట్టుబడులను అన్వేషించడానికి సమావేశం కావాలని క్వాడ్ డెవలప్ మెంట్ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఏజెన్సీల నాయకులు తీసుకున్న నిర్ణయాన్ని క్వాడ్ నాయకులు స్వాగతించారు. ఎక్స్ పోర్ట్ ఫైనాన్స్ ఆస్ట్రేలియా, ఆస్ట్రేలియన్ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్ ఫెసిలిటీ ఫర్ ది పసిఫిక్, ఇండియా ఎక్స్ పోర్ట్ -ఇంపోర్ట్ బ్యాంక్, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్, యు ఎస్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డి ఎఫ్ సి ) అధిపతుల మధ్య 2022లో జరిగిన మునుపటి సమావేశం ఆధారంగా ఈ నిర్ణయం జరిగింది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఆరోగ్య భద్రతకు మద్దతుగా సమన్వయం, సహకారాన్ని బలోపేతం చేయడానికి క్వాడ్ 2023లో క్వాడ్ ఆరోగ్య భద్రతా భాగస్వామ్యాన్ని (క్వాడ్ హెల్త్ సెక్యూరిటీ పార్టనర్ షిప్) ప్రకటించింది. క్వాడ్ హెల్త్ సెక్యూరిటీ పార్టనర్ షిప్ ఈ రోజు ప్రకటించిన కొత్త కార్యక్రమాలతో సహా అంటువ్యాధులు లేదా మహమ్మారి అవకాశం ఉన్న వ్యాధుల వ్యాప్తిని గుర్తించడానికి , ప్రతిస్పందించడానికి ఇండో-పసిఫిక్ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో తన బాధ్యతలను నెరవేరుస్తోంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వ, ప్రైవేట్ వనరులతో క్వాడ్ చారిత్రాత్మక క్వాడ్ క్యాన్సర్ మూన్ షాట్ ప్రాజెక్ట్ ను ప్రారంభిస్తోంది, ఇది మొదట గర్భాశయ క్యాన్సర్ పై దృష్టి సారించింది. మొత్తమ్మీద, ఈ రోజు ప్రకటించిన క్వాడ్ క్యాన్సర్ మూన్ షాట్ రాబోయే దశాబ్దాల్లో లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతుందని అంచనా.

మహమ్మారి నివారణ నిధికి నిరంతర మద్దతుతో సహా ఈ ప్రాంతం అంతటా ఆరోగ్య భద్రత , దృఢత్వ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి క్వాడ్ దేశాలు కట్టుబడి ఉన్నాయి.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఆరోగ్య భద్రతను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని క్వాడ్ పునరుద్ఘాటించింది. 2024 లో, క్వాడ్ హెల్త్ సెక్యూరిటీ పార్టనర్షిప్ రెండవ మహమ్మారి సన్నద్ధత టేబుల్ టాప్ వ్యాయామం ద్వారా ప్రాంతీయ ప్రతిఘటన శక్తిని అభివృద్ధి చేసింది, క్వాడ్ వ్యాక్సిన్ భాగస్వామ్యం విజయంపై ఆధారపడి వ్యాధి వ్యాప్తి అవకాశాల నివారణ, ముందస్తు గుర్తింపు , ప్రతిస్పందనను పెంచడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను అభివృద్ధి చేస్తోంది. ఆరోగ్య అత్యవసర పరిస్థితుల కోసం ప్రాంతీయ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి ఇండో-పసిఫిక్ నుండి ఆరోగ్య నిపుణులకు శిక్షణ ఇవ్వడం క్వాడ్ సహకార ప్రయత్నాలలో ఒకటి.

మహమ్మారి సన్నద్ధతపై భారత్ ఒక వర్క్ షాప్ ను నిర్వహించి అత్యవసర ప్రజారోగ్య ప్రతిస్పందనలను వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయనుంది.

వ్యాధి వ్యాప్తికి ప్రతిస్పందనగా, దేశంలో లేదా ఈ ప్రాంతంలో మోహరించడానికి సిద్ధంగా ఉన్న ప్రజారోగ్య నిపుణుల సమూహాన్ని ఆస్ట్రేలియా పెంచుతోంది, రాబోయే రోజుల్లో ఆస్ట్రేలియాలోని డార్విన్ లో మొదటి శిక్షణా కార్యక్రమం ప్రారంభమవుతుంది.

క్వాడ్ భాగస్వాములతో సమన్వయంతో, అంటువ్యాధుల సవాళ్లను నివారించడానికి, గుర్తించడానికి , ప్రతిస్పందించే సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని పద్నాలుగు దేశాలతో భాగస్వామ్యం కోసం యునైటెడ్ స్టేట్స్ 84.5 మిలియన్ డాలర్లకు పైగా ప్రత్యేకించింది.

ప్రస్తుత క్లేడ్ 1 ఎంపాక్స్ వ్యాప్తికి ప్రతిస్పందనగా, అలాగే కొనసాగుతున్న క్లేడ్ 2 ఎంపాక్స్ వ్యాప్తికి ప్రతిస్పందనగా, తక్కువ , మధ్య-ఆదాయ దేశాలలో తగిన వ్యాక్సిన్ తయారీని విస్తరించడంతో సహా సురక్షితమైన, ప్రభావవంతమైన, నాణ్యత-హామీ కలిగిన ఎంపాక్స్ వ్యాక్సిన్లకు సమాన లభ్యతను ప్రోత్సహించడానికి మన ప్రయత్నాలను సమన్వయం చేయాలని క్వాడ్ యోచిస్తోంది.

ఇరవయ్యేళ్ల క్రితం, క్వాడ్ 2004లో హిందూ మహాసముద్రంలో సంభవించిన భూకంపం, సునామీ పై స్పందించేందుకు ఒక్కటై ముందుకు వచ్చింది. ప్రభావిత దేశాలకు మానవతా సహాయం అందించాయి. 2022లో, క్వాడ్ విదేశాంగ మంత్రులు ఇండో-పసిఫిక్ లో హ్యూమన్ అండ్ డిసాస్టర్ రిస్పాన్స్ (హెచ్ ఎ డి ఆర్) కోసం క్వాడ్ భాగస్వామ్యానికి సంబంధించిన మార్గదర్శకాలపై సంతకాలు చేశారు. మే 2024 లో, పపువా న్యూ గినియాలో విషాదకరమైన కొండచరియలు విరిగిపడిన తరువాత, క్వాడ్ దేశాలు ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా తమ ప్రతిస్పందనను సమన్వయం చేసుకున్నాయి. క్వాడ్ సంయుక్తంగా 5 మిలియన్ డాలర్లకు పైగా మానవతా సహాయాన్ని అందించింది. క్వాడ్ భాగస్వాములు పపువా న్యూ గినియా దీర్ఘకాలిక పునరుద్ధరణ ప్రయత్నాలకు మద్దతు ఇస్తూనే ఉన్నారు. క్వాడ్ హెచ్ ఎ డి ఆర్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూనే ఉంది. ఈ ప్రాంతంలోని భాగస్వాములకు వారి దీర్ఘకాలిక సుస్థిరత ప్రయత్నాలలో మద్దతు ఇస్తోంది.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసర సహాయక సామాగ్రిని సిద్ధంగా ఉంచడం సహా వేగంగా స్పందించడానికి సిద్ధంగా ఉండేలా క్వాడ్ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. ఈ ప్రయత్నం హిందూ మహాసముద్ర ప్రాంతం నుండి, ఆగ్నేయాసియా వరకు, పసిఫిక్ వరకు విస్తరించింది.

రాబోయే నెలల్లో, క్వాడ్ హెచ్ఎడిఆర్ నిపుణులు ఈ ప్రాంతంలో భవిష్యత్తులో సంభవించే అవకాశం ఉన్న విపత్తులకు సిద్ధం చేయడానికి టేబుల్ టాప్ వ్యాయామం నిర్వహిస్తారు. యాగి తుఫాను వినాశకరమైన పరిణామాల నేపథ్యంలో వియత్నాం ప్రజలకు మద్దతుగా క్వాడ్ భాగస్వాములు 4 మిలియన్ డాలర్లకు పైగా మానవతా సహాయం అందించడానికి కలిసి పనిచేస్తున్నారు.

క్వాడ్ భాగస్వాములు ఈ ప్రాంతంలోని భాగస్వామ్య దేశాలతో కలసి సముద్ర భద్రతను బలోపేతం చేయడం, సముద్ర పరిధి అవగాహనను మెరుగుపరచడం, స్వతంత్ర, ఓపెన్ ఇండో-పసిఫిక్‌ను కాపాడడంపై కలిసి పనిచేస్తున్నారు.

సముద్ర పరిధి (మారిటైమ్ డొమైన్) పై అవగాహన, సముద్ర వ్యవహారాలలో శిక్షణ (మారిటైమ్ ట్రైనింగ్) కోసం ఇండో-పసిఫిక్ భాగస్వామ్యంటోక్యోలో జరిగిన 2022 క్వాడ్ నేతల శిఖరాగ్ర సదస్సులో సముద్ర పరిధి (మారిటైమ్ డొమైన్) పై అవగాహన కోసం ఇండో-పసిఫిక్ భాగస్వామ్యాన్ని (ఇండో-పసిఫిక్ పార్ట నర్ షిప్ ఫర్ మారిటైమ్ డొమైన్ అవేర్నెస్ - ఐపీఎండీఏ) ను ప్రారంభించారు. ఈ చొరవ భాగస్వాములకు వాస్తవ కాల ఖర్చుతో కూడుకున్న అత్యాధునిక రేడియో ఫ్రీక్వెన్సీ డేటాను అందిస్తుంది, ఇది వారి సముద్ర జలాల సమర్థ పర్యవేక్షణకు వీలు కల్పిస్తుంది; చట్టవిరుద్ధమైన, సమాచారం లేకుండా , నిబంధనలకు విరుద్ధంగా జరిగే చేపల వేటను నిరోధించడానికి , వాతావరణ మార్పులు , ప్రకృతి వైపరీత్యాలకు ప్రతిస్పందించడానికి , తమ చట్టాలను తమ జలాల పరిధిలో అమలు చేసేందుకు సహాయపడుతుంది.

ఈ ప్రకటన వెలువడినప్పటి నుండి, భాగస్వాములతో సంప్రదింపులు జరిపిన తరువాత, క్వాడ్ విజయవంతంగా ఇండో-పసిఫిక్ ప్రాంతం అంతటా- ఆగ్నేయాసియాలోని భాగస్వాములతో కలసి పసిఫిక్ ఐలాండ్స్ ఫోరం ఫిషరీస్ ఏజెన్సీ ద్వారా, గురుగ్రాం లోని ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్-హిందూ మహాసముద్ర ప్రాంతానికి విస్తరించింది. అలా చేయడం ద్వారా, క్వాడ్ రెండు డజన్ లకు పైగా దేశాలకు డార్క్ వెసెల్ మారిటైమ్ డొమైన్ అవగాహన డేటాను పొందడంలో సహాయపడింది, తద్వారా ఆ దేశాలు తమ ప్రత్యేక ఆర్థిక మండలాలలో చట్టవ్యతిరేక కార్యకలాపాలతో సహా ఇతర కార్యకలాపాలను మరింత మెరుగ్గా పర్యవేక్షించే వీలు కలిగింది.

ఈ రోజు ప్రకటించిన తదుపరి దశ అమలులో, క్వాడ్ రాబోయే సంవత్సరంలో క్వాడ్ కొత్త సాంకేతికత, డేటాను ఐపిఎండిఎ లో ప్రవేశపెట్టి, ఈ ప్రాంతానికి ఆధునిక సామర్థ్యాన్ని , సమాచారాన్ని అందించడం కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భాగస్వాములకు సముద్ర డొమైన్ అవగాహన పై స్పష్టమైన అవగాహన చిత్రం కోసం ఎలక్ట్రో-ఆప్టికల్ డేటా , అధునాతన విశ్లేషణ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించాలని క్వాడ్ భావిస్తోంది.

ఈరోజు క్వాడ్ ఒక కొత్త ప్రాంతీయ సముద్రాధారిత శిక్షణ కార్యక్రమం (మైత్రి ) ని ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని భాగస్వామ్య దేశాలకు అందుబాటులో ఉంచింది. ఈ కార్యక్రమం ద్వారా భాగస్వామ్య దేశాలు ఐ పి ఎం డి ఎ, ఇతర క్వాడ్ భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా అందించిన పరికరాలను పర్యవేక్షించడానికి, వారి జలాల రక్షణకు చట్టాలను అమలు చేయడానికి, అక్రమ ధోరణులను అడ్డుకోవడానికి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. 2025 లో ప్రారంభ మైత్రి వర్క్ షాప్ కు భారతదేశం ఆతిథ్యం ఇవ్వాలని క్వాడ్ దేశాలు ప్రతిపాదిస్తున్నాయి.

క్వాడ్ దేశాలు చట్టపరమైన, నిర్వహణ పరమైన సాంకేతిక పరమైన సముద్ర భద్రత , చట్టాల చట్ట అమలు పరిజ్ఞాన రంగాలలో సమగ్ర , సంపూర్ణ శిక్షణను సమన్వయం చేస్తున్నాయి. క్వాడ్ భాగస్వాములు ప్రాంతీయ సముద్ర చట్టాల అమలలో భాగస్వామ్యాన్ని విస్తరించడానికి, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి, పౌర సహకారాన్ని మెరుగుపరచడానికి నిబద్ధతను ప్రకటించారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలపై పౌర ప్రతిస్పందనకు మరింత వేగంగా , సమర్థవంతంగా మద్దతు ఇవ్వడానికి నాలుగు దేశాల మధ్య భాగస్వామ్య విమాన రవాణా (ఎయిర్ లిఫ్ట్) సామర్థ్యాన్ని కొనసాగించడానికి , రవాణా పరంగా సమిష్టి బలాలను ఉపయోగించడానికి క్వాడ్ ఈ రోజు ఇండో-పసిఫిక్ లాజిస్టిక్స్ నెట్ వర్క్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. ఇండో-పసిఫిక్ భాగస్వాములతో ప్రస్తుతం ఉన్న ప్రయత్నాలకు ఈ చర్య మరింత తోడ్పడుతుంది.

2025లో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సమగ్రతను మెరుగుపరచడానికి యుఎస్ కోస్ట్ గార్డ్, జపాన్ కోస్ట్ గార్డ్, ఆస్ట్రేలియన్ బోర్డర్ ఫోర్స్, ఇండియన్ కోస్ట్ గార్డ్ కలిసి మొదటిసారిగా క్వాడ్-ఎట్-సీ షిప్ అబ్జర్వర్ మిషన్‌ను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ ప్రయత్నం ద్వారా, జపాన్ కోస్ట్ గార్డ్, ఆస్ట్రేలియన్ బోర్డర్ ఫోర్స్, ఇండియన్ కోస్ట్ గార్డ్ సభ్యులు ఇండో-పసిఫిక్‌లో పనిచేస్తున్న యుఎస్ కోస్ట్ గార్డ్ నౌకలో సమయం గడపనున్నారు. ఇండో-పసిఫిక్‌లో తదుపరి మిషన్లను కొనసాగించాలని క్వాడ్ ఉద్దేశిస్తోంది.

కనెక్టివిటీ పెంపు, ప్రాంతీయ సామర్థ్యాన్ని పెంపొందించడం , క్లిష్టమైన అవసరాలను తీర్చడానికి క్వాడ్ ఈ ప్రాంతానికి నాణ్యమైన, మన్నికైన మౌలిక సదుపాయాలను అందిస్తోంది.

ఈ సంవత్సరం, క్వాడ్ దేశాల ఎగుమతి పరపతి ఏజెన్సీలు (ఇసిఎలు) ఒక సహకార ఒప్పందంపై సంతకం చేసి అమలు చేస్తున్నాయి, ఇది సరఫరా యంత్రాంగం పటిష్టత, క్లిష్టమైన ,అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, ఇండో-పసిఫిక్ లోని ఇతర అధిక-నాణ్యత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుంది. క్వాడ్ ఈసిఏలు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సమాచారం పై కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడం, ప్రాజెక్టుల కోసం అవసరమైన ఫైనాన్సింగ్‌ను అందించడం కోసం పని చేస్తున్నాయి. పరిశ్రమ నిపుణులు, ప్రాజెక్ట్ డెవలపర్లు, ఇతర ముఖ్యమైన మార్కెట్ వాటాదారులను కలిపే సామూహిక వ్యాపార ప్రోత్సాహ ప్రయత్నాలను పర్యవేక్షించనున్నాయి.

డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి , అమలుకు సంబంధించిన సంయుక్త నియమాలను క్వాడ్ విడుదల చేసింది, భాగస్వామ్య శ్రేయస్సు , సుస్థిర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి ఇది సమ్మిళిత, బహిరంగ , స్థిరమైన, న్యాయమైన, సురక్షితమైన, నమ్మదగిన, భద్రతగల డిజిటల్ భవిష్యత్తుకు క్వాడ్ నిబద్ధతను ప్రకటిస్తుంది.

ఈ కొత్త భాగస్వామ్యం ద్వారా, క్వాడ్ భాగస్వాములు సమన్వయం, సమాచార మార్పిడి, ఈ ప్రాంతంలోని భాగస్వాములతో ఉత్తమ పద్ధతులను పంచుకోవడం ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతం అంతటా నాణ్యమైన నౌకాశ్రయ మౌలిక సదుపాయాలలో ప్రభుత్వ , ప్రైవేట్ రంగ పెట్టుబడులను సమీకరించాలని భావిస్తున్నారు.

క్వాడ్ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెలోషిప్ ను క్వాడ్ నాయకుల శిఖరాగ్ర సదస్సులో ప్రకటించారు, ఇది సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి , మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రూపకల్పన, నిర్వహణ , పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ ప్రాంతం అంతటా ప్రొఫెషనల్ నెట్ వర్క్ లను బలోపేతం చేస్తుంది. గత ఏడాదిలో, ఇది 2,200 మందికి పైగా నిపుణులకు విస్తరించింది క్వాడ్ భాగస్వాములు ఇప్పటికే 1,300 కంటే ఎక్కువ ఫెలోషిప్ లను అందించారు.

కేబుల్ అనుసంధానం, సుస్థిరత కోసం క్వాడ్ భాగస్వామ్యంతో, ఇండో-పసిఫిక్‌లో నాణ్యమైన సముద్ర గర్భ (అండర్ సీ) కేబుల్ నెట్‌వర్క్‌లకు క్వాడ్ భాగస్వాములు మద్దతు ఇస్తూ, వాటి సామర్థ్యం, దృఢత్వం , విశ్వసనీయత ను బలోపేతం చేస్తున్నారు. ఇవి ప్రపంచ భద్రత , శ్రేయస్సుతో విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయి.

ఈ ప్రయత్నాలకు మద్దతుగా, ఆస్ట్రేలియా గత జూలైలో కేబుల్ కనెక్టివిటీ అండ్ రెసిస్టెన్స్ సెంటర్ ను ప్రారంభించింది, ఇది ఈ ప్రాంతం అంతట నుంచి వచ్చిన అభ్యర్థనలకు ప్రతిస్పందనగా వర్క్ షాప్ లను, విధాన , నియంత్రణ పరంగా సహాయాన్ని అందిస్తోంది.

,ప్రత్యేక ఏజెన్సీలు , అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఇండో-పసిఫిక్‌లో కనెక్టివిటీ , స్థిరత్వాన్ని పెంచేందుకు జపాన్ సామర్థ్య పెంపు శిక్షణలను నిర్వహించింది. నౌరు, కిరిబాటిలో సముద్రగర్భ కేబుల్ కోసం పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్మెంట్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి సాంకేతిక సహకారాన్ని మరింత విస్తరించాలని జపాన్ భావిస్తోంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని 25 దేశాలకు చెందిన టెలికమ్యూనికేషన్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ లకు యునైటెడ్ స్టేట్స్ 1,300కు పైగా సామర్థ్య పెంపు శిక్షణలను నిర్వహించింది. కాంగ్రెస్ తో కలిసి ఈ శిక్షణా కార్యక్రమాన్ని పొడిగించడానికి, విస్తరించడానికి అదనంగా వి3.4 మిలియన్లు పెట్టుబడి పెట్టాలని ఉద్దేశిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.

కేబుల్ ప్రాజెక్టులలో క్వాడ్ భాగస్వాముల పెట్టుబడులు 2025 చివరి నాటికి ప్రాథమిక టెలికమ్యూనికేషన్ కేబుల్ కనెక్టివిటీని సాధించడంలో అన్ని పసిఫిక్ ద్వీప దేశాలకు మద్దతు ఇవ్వడానికి సహాయపడతాయి. గత క్వాడ్ లీడర్స్ శిఖరాగ్ర సమావేశం తరువాత క్వాడ్ భాగస్వాములు ఇతర అనుకూల భాగస్వాములతో కలిసి పసిఫిక్‌లో సముద్రగర్భ కేబుల్ నిర్మాణాలకు వి140 మిలియన్లకు పైగా నిధులను ప్రకటించారు.

## నవంబర్ 9 ,10 తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపులు.

**-29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ ప్రకటన.**

**-2025 జనవరి 1 కి 18 సంవత్సరాల నిండే వారందరూ ఓటర్ నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి.**

సంగారెడ్డి సెప్టెంబర్ 23(నేటి నిజం ప్రతినిధి)అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటించడం జరుగుతుందని, దానిని పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు.

తుది ఓటరు జాబితా ప్రకటన కోసం బిఎల్వోలు ఇంటింటి సర్వే కార్యక్రమం ఈనెల 26 లోగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటనలో తప్పులు లేకుండా జాబితా ప్రకటించేల బిఎల్వోలు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపాలన్నారు.

డ్రాఫ్ట్ రోల్ లో తప్పులు లేకుండా తుది ఓటరు జాబితా ప్రకటన సులువు అవుతుందన్నారు. నవంబర్ 9,10 తేదీలలో బిఎల్ఓలు అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులలో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరిని ఓటరుగా నమోదు చేసుకొని ఉన్నట్లు తెలిపారు. ఈ క్యాంపులలో ఫారం 6, 7 ,8 అందుబాటులో ఉంటాయన్నారు నూతన ఓటర్ నమోదుకు 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఆన్లైన్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాజకీయ పార్టీల నాయకులు మహిళా సంఘాల సభ్యులతో ఓటర్ నమోదుపై విస్తృత ప్రధాన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## ఎన్డీయే నాలుగోసారి అధికారంలోకి వస్తామన్న హామీ ఇవ్వలేను కానీ...

**నేను మాత్రం మరోసారి మంత్రి అవుతా తోటి మంత్రిపై నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు**

నాగ్‌పూర్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తోటి కేబినెట్ మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) చీఫ్ రాందాస్ అథవాలే ని ఉద్దేశించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం (ఎన్డీయే) నాలుగోసారి అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు కానీ.. ఆయన మాత్రం మరోసారి మంత్రి అవుతారంటూ వ్యాఖ్యానించారు.మహారాష్ట్ర నాగ్‌పూర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో స్టేజ్‌పై అథవాలే కూడా ఉండటం గమనార్హం. 'మా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వస్తుందని హామీ ఇవ్వలేను.. కానీ రాందాస్ అథవాలే మాత్రం మంత్రి అవుతారని ఖచ్చితంగా హామీ ఇవ్వగలను' అంటూ చమత్కరించారు. ఇది జోక్ మాత్రమే అంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో స్టేజ్‌పై ఉన్న అథవాలే సరదాగా నవ్వులు చిందించారు. ప్రస్తుతం గడ్కరీ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కాగా, రామ్‌దాస్ అథవాలే వరుసగా మూడుసార్లు కేంద్ర మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే.

# న్యాయం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

**-తాము చెప్పినట్టే పిర్యాదు రాయాలంటూ సిఐ వత్తిడి**

**-విలేకరుల సమావేశంలో మృతిని బంధువుల ఆవేదన**




ఖమ్మం, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి): మా కుమారుడు కళ్యాణ చక్రవర్తి ది ఆత్మహత్య కాదు ముమ్మాటికి హత్యేనని మృతిని తండ్రి మల్లినేని ప్రసాద్, బాబాయిలు మల్లినేని భాస్కర్, వెంకటేశ్వర్లు, మామయ్య వెంకటనారాయణ ఆరోపించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... మల్లినేని కళ్యాణ్ చక్రవర్తి (29) గతంలో ఖమ్మంలో ఉద్యోగం చేశాడు. ఆ సమయంలో తన స్నేహితులకు అప్పుగా డబ్బులు ఇచ్చాడన్నారు. ఈనెల 15న ఇందిరానగర్లో గతంలో తాను కిరాయి కున్న రూమ్ దగ్గరకు డబ్బుల వసూళ్లకు వెళ్లి అడిగినప్పుడు ఇద్దరు బుల్లెట్ పై బెదిరించారని కొందరు స్థానికులు చెప్పారని ఆరోపించారు. ఖమ్మం వచ్చిన కళ్యాణ్ చక్రవర్తి సాయంత్రం 4:15 గంటలకు కన్‌స్ట్రక్షన్ జరుగుతున్న బిల్డింగ్ మీద నుండి పడి చనిపోతే రాత్రి 7:45 కి పోలీసులు సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు ద్వారా మార్చురికి తరలించారన్నారు. కానీ మృతుని తల వెంట్రుకలు గోడపై అతికి ఉన్నాయని, రెండు కాళ్లు, చేయి విరిగిపోయి ఉన్నప్పటికీ ఆత్మహత్యగా సృష్టిస్తున్నారని బాధను వ్యక్తం చేశారు. కళ్యాణ్ చక్రవర్తి ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదని అప్పు తీసుకున్న వారి నుండి డబ్బులు వసూలు చేయడానికే ఖమ్మం వచ్చాడని అన్నారు. ఖమ్మం టూ టౌన్ లో ఆత్మహత్య కాదు ఇది హత్య అని ఫిర్యాదు చేయటానికి వెళితే అక్కడ సిఐ నేను చెప్పినట్టుగా ఫిర్యాదు రాసిస్తేనే తీసుకుంటామని చెప్పి ఫిర్యాదు తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఎటువంటి విచారణ చేపట్టలేదని, మృతుని ఫోన్ కాల్ ఆధారంగా విచారం జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. తాము ఎంతటి న్యాయ పోరాటానికి సిద్ధమని, జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# హనుమకొండలో ఒక దివ్య క్షేత్రమౌతుంది రామకృష్ణ ధ్యాన మందిర్

**- మాజీ ఎంపి వినోద్ కుమార్**

హనుమకొండ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); శ్రీ రామకృష్ణ సేవా మందిర్ నిర్మాణ పనులను



తెరాస నేతలు మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, హనుమకొండ అధ్యక్షులు మాజీ శాసన సభ్యులు దాస్యం వినయ్ భాస్కర్, ముద్దసాని సహోదర్ రెడ్డి, మేడిపల్లి శోభన్ బాబు, చింతల యాదగిరి తదితరులు సందర్శించారు. సదరు ధ్యాన మందిర్ కట్టడంలో చేపట్టాల్సిన దశలవారీ పనుల గురించి చర్చించారు. నిధుల సేకరణ విషయంలో గ్రానైట్, లిఫ్ట్, రూఫ్ సీలింగ్, డోర్స్ / విండోస్, ఎలక్ట్రికల్ /సానిటరీ ఫిట్టింగ్స్ వగైరా ఖర్చుల అంచనాలు ప్రకటించి వాటిని భరించే దాతలనుండి స్వీకరించాలని వినోద్ కుమార్ గారు సూచించారు. భావి తరాలను సంస్కారవంతంగా, మహోన్నతంగా తీర్చిదిద్దే దివ్య మందిరంగా, ఈ కాలనీకి వన్నె తెచ్చే దర్శనీయ ప్రాంగణంగా నిలుస్తుందని, తమ పక్షాన ఈ మందిర నిర్మాణానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని దాస్యం వినయ్ భాస్కర్ గారన్నారు. కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సహాయ-సహకారాలు అందిస్తున్న వారందరికీ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సేవా సమితి సభ్యులు కె. శ్రీనివాస స్వామి, కెవి రావు, కె.సూర్య, చిదర అంజనీ దేవి, బోయినపల్లి పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభలో బీసీ రిజర్వేషన్లు ఏపీ క్యాబినెట్ ఆమోదం ఎన్డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్**

అమరావతి సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఈరోజు చట్టసభలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లపై ఏపీ క్యాబినెట్ తీర్మానం అభినందనీయం మంత్రి కొల్లు రవీందర్ తో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ భేటీ అయినారు. ఈ



సంధర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ బిజెపి రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షులు దగ్గుపాటి పురుందేశ్వరి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అని రాష్ట్రాల్లో పేదల ఆరోగ్యం కోసం ఆలోచించి గత ప్రభుత్వంలో ఎంతో ఇబ్బందులకు గురైన బ్రాండ్ల విషయంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడాయని ప్రస్తుతం ఎండీఏ ప్రభుత్వం నాణ్యమైన మద్యంతో పాటు సరసమైన ధరలకు 99 రూపాయలకే కోటర్ మధ్య వచ్చే విధంగా కమిటీ చైర్మన్ తీసుకోవడం అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత రెండు నెలల క్రితమే మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర గారికి డబల్ డిజిట్ మద్యం అందుబాటులోకి తేవాలని కోరామని ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం గురించి ఆర్థిక భద్రత గురించి ఆలోచించి తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నామని తెలియజేశారు . ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ మైనింగ్ శాఖ మంత్రివర్యులు శ్రీ కొల్లు రవీంద్ర గారిని బీసీ నేతలు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగ సంఘాల కన్వీనర్ పావులూరి హనుమంతరావు రాష్ట్ర కార్యదర్శి జే టి మల్లికార్జున్ మల్లికార్జున్ కోయ దొరగారు బిసి నేతలు పాల్గొన్నారు

# కర్నూలులో హైకోర్టు బెంచ్.. అమరావతిలో అంతర్జాతీయ 'లా' కళాశాల..



అమరావతి, సెప్టెంబర్ 23 : కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన న్యాయశాఖపై సమీక్ష నిర్వహించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనలను త్వరలోనే కేంద్రానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. మంత్రివర్గ భేటీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. అమరావతిలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు ద్వారా 100 ఎకరాల్లో న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ అకాడమీ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.

అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ పథకాల పునర్వ్యవస్థీకరణపై చర్చించారు. కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్‌భవన్‌ను పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. మైనార్టీలకు లబ్ధి జరిగేలా వక్ఫ్ భూములను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

# కమిషనర్ గారు దయచేసి నాకు 10,116/- ఫైన్ గా చెల్లించండి

**-పోలీసు కమిషనర్ కు ఫైన్ వేసిన కరీంనగర్ భారతీయుడు**

కరీంనగర్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్థానిక కరీంనగర్ పట్టణంలో రోడ్లు అన్ని కూడా అస్తవ్యస్తంగా అధ్వానంగా ఉన్నాయి మెయిన్ చౌరస్తాలో కూడా అధ్వానంగా ఉన్నాయి. వాటి వల్ల అన్ని వాహనాలు డ్యామేజ్ అవుతున్నాయి. హెల్మెట్ ఫైన్, సీట్ బెల్ట్ ఫైన్ , డ్రంక్ అండ్ డ్రైవ్ ఫైన్ , రాంగ్ రూట్ ఫైన్ , పార్కింగ్ ఫైన్... వలీబి ..అంటు అన్ని రకాల ఫైన్స్ వసూలు చేస్తూ మీరు కనీసం సరైన రోడ్డు సదుపాయాలు కూడా కల్పించినందుకు గాను , మేమందరం రోడ్లు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందుకు గాను , మా వాహనాలు డ్యామేజ్ అవుతున్నందుకు గాను మేము మీకెంత ఫైన్ వేయాలి.కోర్టు చౌరస్తాలో రోడ్డు సరిగా లేకపోవడం వలన తన కారు డ్యామేజ్ అయినందుకు గాను కోట శ్యాం కుమార్ ( కరీంనగర్ భారతీయుడు) పోలీసు కమిషనర్ గారిని 10116 చెల్లించాల్సిందిగా కోరారు.

# అట్టహాసంగా కాలిఫోర్నియా "వీక్షణం" సాహితీ గవాక్షం 12వ వార్షికోత్సవం!



హైదరాబాద్, సెప్టెంబర్ 23 : వీక్షణం 12 వ వార్షికోత్సవం అటు కాలిఫోర్నియాలోనూ, ఇటు అంతర్జాలంలోనూ సెప్టెంబరు 14, 20, 21వ తేదీల్లో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా అమెరికాలోని ప్రముఖ కథారచయిత, భాషా నిపుణులు, వేమూరి నిఘంటు నిర్మాణ కర్త డా॥వేమూరి వేంకటేశ్వర్రావు గారికి వీక్షణం "జీవన సాఫల్య పురస్కారాన్ని" అందజేసి ఘనంగా సత్కరించింది.

సెప్టెంబరు 14, 2024 తేదీన కాలిఫోర్నియాలోని ప్లెసంటన్ నగరంలో జరిగిన వీక్షణం 12 వ వార్షికోత్సవాన్ని వీక్షణం వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.కె.గీత గారు నిర్వహించారు. ముందుగా ఈ వార్షికోత్సవ సందర్భంగా డా॥వేమూరి వేంకటేశ్వర్రావు గారికి వీక్షణం "జీవన సాఫల్య పురస్కారాన్ని" అందజేసి ఘనంగా సత్కరించింది. ఈ సన్మాన కార్యక్రమం తరువాత వీక్షణం 12 వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికల ఆవిష్కరణలు శ్రీ కిరణ్ ప్రభ, శ్రీమతి కాంతి పాతూరి, డా.కె.గీత, శ్రీ వేణు ఆసూరి, శ్రీ తల్లాప్రగడ రావు, శ్రీ శ్రీధర్ రెడ్డిగార్ల చేతుల మీదుగా జరిగాయి. ముఖ్య అతిథిగా శ్రీ దేవినేని మధుసూదనరావు విచ్చేసి "తెలుగు- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే అంశంమీద ప్రసంగించారు. తరువాత శ్రీ తల్లాప్రగడ రావు గారి నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనం యువకవి శ్రీ ఆది మోపిదేవి కవిత్వగానంతో ప్రారంభమైంది. స్థానిక ప్రముఖ కవులు డా.కె.గీత, శ్రీమతి షంషాద్, శ్రీ శ్రీధర్ రెడ్డి మొ.న వారు ఈ కవిసమ్మేళనంలో పాల్గొన్నారు.

తరువాత శ్రీమతి శారద కాశీవఝుల ఆధ్వర్యంలో జరిగిన ఇష్టాగోష్టిలో శ్రీ కిరణ్ ప్రభ, శ్రీ వేణు ఆసూరి, శ్రీ చిమటా శ్రీనివాస్, శ్రీ ప్రసాదరావు గోగినేని, శ్రీమతి ఉదయలక్ష్మి, శ్రీ గాంధీ ప్రసాద్, శ్రీ సత్యనారాయణ ప్రసాద్, శ్రీ వేమూరి శ్రీరామ్, శ్రీమతి జయశ్రీ మొ.నవారు పాల్గొన్నారు. ఆద్యంతం ఆసక్తిదాయకంగా జరిగిన ఈ సమావేశంలో కాలిఫోర్నియా స్థానిక కవులు, రచయితలు, సాహిత్యాభిలాషులు పాల్గొని సభను విజయవంతం చేసారు.

సెప్టెంబరు 20/21, 2024 తేదీలలో వీక్షణం 12 వ వార్షికోత్సవం అంతర్జాలంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షణం వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ రచయిత్రి డా.కె.గీతామాధవి సభకు ఆహ్వానం పలికి ప్రారంభించారు. ఈ అంతర్జాల కార్యక్రమంలో ముందుగా వీక్షణం భారతదేశ ప్రతినిధి శ్రీ గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ వీక్షణం ప్రత్యేక సంచికలను ఆవిష్కరించారు. శ్రీ కందుకూరి శ్రీరాములు, శ్రీ వసీరా ఆత్మీయవాక్యాలు పలికారు. శ్రీమతి సుధా కొలచన కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. ఇండియా, అమెరికా దేశాల నుండి కవులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ కవి సమ్మేళనంలో కందుకూరి శ్రీరాములు, డా॥కె.గీత, వసీరా, కమర, శ్రీధర్ రెడ్డి బిల్లా, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, డాక్టర్ మోటూరి నారాయణరావు, కందూర్ చంద్ర ప్రకాశ్ గుప్తా, డాక్టర్ దేవులపల్లి పద్మజ, శ్రీసుధ కొలచన, డా.చీదెళ్ళ సీతాలక్ష్మి, మేడిశెట్టి యోగేశ్వరరావు, మామిళ్ల లోకనాథం, మల్కని విజయలక్ష్మి, ఎన్. రత్నలక్ష్మి, అమృతవల్లి అవధానం, ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్, డా. కందేపి రాణీప్రసాద్, లగిశెట్టి రాము, కె వి యస్ గౌరీపతి శాస్త్రి (వీరవతి), చిట్టాబత్తిన వీరరాఘవులు, అమీనా కలందర్, ప్రసాదరావు రామాయణం, డా. అరుణ కోదాటి, గుర్రం మల్లేశం, మనోహర్ రెడ్డి గంటా, రామకృష్ణ చంద్రమౌళి, ఉప్పలపాటి వెంకట రత్నం, డా. భోగెల. ఉమామహేశ్వరరావు (ఉమాకవి), శోభాదేశ పాండే, జె.వి.కుమార్ చేపూరి మొ.న వారు పాల్గొని కవితాగానం చేసారు.

ఎందరో సాహిత్యాభిలాషులు విశేషంగా పాల్గొన్న ఈ వార్షికోత్సవ సందర్భంగా వీక్షణం అధ్యక్షులు డా.కె.గీతామాధవి కవులకు, కవితల పోటీ విజేతలకు ప్రశంసాపత్రాల్ని అందజేశారు.

గత పన్నెండేళ్లుగా "వీక్షణం" సాహితీ గవాక్షం అమెరికాలోని కాలిఫోర్నియా, బే ఏరియా లోనే కాక, గత రెండేళ్లుగా అంతర్జాతీయ అంతర్జాల సాహిత్య కార్యక్రమాలు జరుపుకుంటూ ప్రవాసాంధ్రుల తెలుగు భాషాభిమానాన్ని, సాహిత్యాభిలాషని ప్రపంచమంతా చాటుతున్నది.

# కామారెడ్డి లో తెలంగాణ రైతు గ్రామీణ జీవితం పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవి కీర్తి పురస్కార గ్రహీత సూరారం శంకర్



హైదరాబాద్, సెప్టెంబర్ 23 : మట్టి మనుషులైన అన్నదాతలను కాపాడుకోవడం వారికి తగిన సౌకర్యాలను కల్పించడం సమాజ బాధ్యత అని పల్లెల్లోని శ్రమజీవన సౌందర్యాన్ని తెలంగాణ రైతు కాపాడుతున్నాడని రైతే తెలంగాణకు అంబాసిడర్ అని శ్రామికుల రైతుల జీవాత్మనే ఈ ఈ నేలకు పునాది అని ప్రముఖ గజల్ కవి కీర్తి పురస్కార గ్రహీత సూరారం శంకర్ అన్నారు

ఆదివారం కామారెడ్డి లోని సీనియర్ సిటిజన్ ఫోరం లో తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ కవి రచయిత యోగ మాస్టర్ ,కాసర్ల రామచంద్రం రచించిన పరిశోధక గ్రంథం 'తెలంగాణ రైతు గ్రామీణ జీవితం' అనే పుస్తకాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించి సూరారం శంకర్ మాట్లాడారు

తెలంగాణలోని రైతుల జీవితం ఆయా వృత్తుల ప్రాధాన్యత వ్యవసాయ పద్ధతులు సేద్యానికి అవసరమైన పనిముట్లు నీటి పారుదల వసతులు రైతు అనుభవించే వివిధ రకాల కష్టాలు నష్టాలను రైతుకు చేయాల్సిన సేవలను ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలను రచయిత కాసర్ల రామచంద్రం రాసిన తెలంగాణ రైతు గ్రామీణ జీవితం పుస్తకంలో ఉన్నాయన్నారు

విశిష్ట అతిథులుగా విచ్చేసినటీఎస్ పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ రక్తాన్ని చెమటగా చేసి తన శక్తినంత ధారపోసే రైతు భూమాతను నమ్ముకుని బతుకుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను రక్షించే వారధిగా రైతు జీవితము వ్యవసాయం చుట్టూ అల్లుకొని ఉండి ఘన వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నాడని రైతు కష్టానికి విలువ కట్టలేమని అన్నారు

మరో విశిష్ట అతిథి గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్నా రాజేశ్వర్ మాట్లాడుతూ కవిగా రచయితగా కాసర్ల రామచంద్రం అటు సమాజానికి సాహిత్యాన్ని అందిస్తూ యోగా గురువుగా సమాజానికి ఆరోగ్యాన్ని పంచుతున్నాడని రైతు జీవితం పై రాసిన ఈ పుస్తకం లో రైతుల జీవితాన్ని పరిస్థితులను వాడే పనిముట్లను రైతు వాస్తవిక చిత్రమాలికగా ఈ పుస్తకం నిలిచిందని ఒక పరిశోధన పుస్తకంగా అందరికీ ఉపయోగపడుతుందన్నారు కామారెడ్డి లో సాహిత్య పరిమళాలు గుబాలిస్తున్నాయని సాహిత్య సృజన చాలా గొప్పగా జరుగుతున్నదని సాహితీవేత్తలను అభినంది వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామన్నారు.

తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ తెలంగాణ రైతు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు ఆయన చేస్తున్న కృషి వాడే పరికరాలు పడే ఇబ్బందులు జీవన వ్యవహారము పూర్తిగా ఈ పుస్తకంలో ఉన్నదని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు

ప్రముఖ వ్యాఖ్యాత అంబీర్ మనోహర్రావు మాట్లాడుతూ కాసర్ల రామచంద్రం ఇదివరకు ఎన్నో పుస్తకాలను రాసి ఘన కీర్తిని పొందారన్నారు ఈ పుస్తకంలో రైతుల తెలంగాణ గ్రామీణ సమాజం అనుబంధాలు సంస్కృతి సాంప్రదాయాలు పల్లెల్లోని అనుబంధాలు ప్రేమలు కనిపిస్తాయని అన్నారు

ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత కాసర్ల రామచంద్రం ను తెరవే ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు

ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పబ్బ విజయశ్రీ వ్యవహరించారు

ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ , సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కామారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్నా రాజేశ్వర్, ప్రముఖ వ్యాఖ్యాత అంబీర్ మనోహర్ రావు, తెరవే ఉపాధ్యక్షులు , ఎనిశెట్టి గంగా ప్రసాద్ , మంద పీతాంబర్, ప్రముఖ వ్యాఖ్యాత పబ్బ విజయశ్రీ, తెరవే ఉపాధ్యక్షులు నాగభూషణం, తెరవే ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్ రాజ్ నవీన్ రెడ్డి, కొడి రవీందర్, వైద్య శేషారావు, ప్రభాకర్, కిషన్, లింగం, పూర్ణచందర్రావు , తిరుపతిరావు, నారాయణ రావు, పీవీ నరసింహం , రామ్మోహన్, తెరవే బాధ్యులు సభ్యులు కవులు. రచయితలు సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు యోగ సభ్యులు పాల్గొన్నారు.

కామారెడ్డి లో తెలంగాణ రైతు గ్రామీణ జీవితం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూరారం శంకర్ చిత్రంలో ప్రముఖ కవి రచయిత గఫూర్ శిక్షక్ టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానందన్ కామారెడ్డి గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్నా రాజేశ్వర్ ప్రముఖ వ్యాఖ్యాత అంబీర్ మనోహర్రావు ఎనిశెట్టి గంగా ప్రసాద్ మంద పీతాంబర్ పంప విజయ శ్రీ

# స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాలు మహిళలకే కేటాయించాలి

**–తెలంగాణ ప్రవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక**

మేడ్చల్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); విద్యావంతమైన సమాజంలో అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా మహిళలు వెనకబడిపోతున్నారని తెలంగాణ ప్రవేటు ఉద్యోగుల సంఘంరాష్ట్ర అధ్యక్షురాలు, మేడ్చల్ జిల్లా పద్మశాలి జిల్లా మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక అమర్ నేత అన్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళలను రాజకీయంగా అణచివేసే ప్రయత్నాలు జరగడం దురదృష్టకరమన్నారు. నేడు ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సూచనలు చేయడం, ప్రకటనలు చేయడం తప్ప రాజకీయ పార్టీలు ప్రోత్సహిస్తున్న సందర్భాలు కనిపించడం లేదన్నారు. ఆకాశంలో సగమనే మాటలు తప్ప, మహిళలను రాజకీయాలలోకి రాకుండా చూస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మహిళల్లో విద్యాధికుల శాతం తక్కువగా వుండేది. రాజకీయ చైతన్యం అంతంత మాత్రంగానే వుండేది. కానీ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో విజయాలు సాధిస్తున్నారు. అయినా మహిళలు అటు పారిశ్రామిక రంగంలో, విద్యా రంగంలో, క్రీడా రంగాలలో అనుకున్నంత ప్రోత్సాహకాలు అందడం లేదు. మహిళా సమాజంలో అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే ముందు మహిళలు రాజకీయంగా ముందుకు వస్తేనే సమాజం మరింత పురోభివృద్ధిలోకి వస్తుంది. కేంద్ర ప్రభుత్వాలు మహిళా నాయకులకు తగు ప్రాధాన్యత కల్పించడం లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో మహిళా నేతలను ముందు పెట్టి ప్రచారాలు సాగిస్తాయే తప్ప పదవుల పంపకాలలో వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు మహిళలను ప్రోత్సాహించే విధంగా నిరంతరం రాజకీయ సదస్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. రాజకీయ పదవులలో కీలక భూమిక పోషించేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత కావాలి. మహిళలు రాజకీయాలలోకి రావాలని ప్రకటనలు చేస్తే సరిపోదన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు నామినేట్ పోస్టులలో మహిళలకు విశేష ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఇక మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సాహిస్తూ మహిళా పారిశ్రామిక సదస్సులు ప్రభుత్వాలే ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఇలా అన్ని రంగాలలో మహిళలకు ప్రోత్సాహం కల్పించినప్పుడే సామాజిక వికాసం జరుగుతుందన్నారు. అందుకోసం తాను ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతానని, త్వరలో తన కార్యాచరణ ప్రకటిస్తానని ఆమె తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళల రిజర్వేషన్ తో పాటు, వెసులుబాటు వున్న అన్ని గ్రామాలలో, ఎంపిటిసి, జడ్పిటిసి. ప్రాదేశిక నియోజకవర్గాలలో అత్యధిక సీట్లు అందజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు వినతిపత్రాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని ప్రవల్లిక అమర్ నేత వెల్లడించారు.

# గార్డెన్ మధ్యలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు డివిజన్ స్థాయి ప్రజాసంఘాల వినతి పత్రం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన సమీపంలో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహా సుందరీకరణలో భాగంగా అంబేద్కర్ విగ్రహాన్ని గార్డెన్ మధ్యలో ఏర్పాటు చేయాలని వేములవాడ డివిజన్ స్థాయి అంబేద్కర్ అభిమానులు, ప్రజా సంఘాలు వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల తర్వాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అభివృద్ధి చేస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అభివృద్ధిలో భాగంగా అంబేద్కర్ విగ్రహం చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని కోరుకున్నారు. అంబేద్కర్ అభిమానుల వినతి పత్రానికి సానుకూలంగా స్పందించిన వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు డివిజన్ స్థాయి అంబేద్కర్ అభిమాన ప్రజా సంఘాల నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. డివిజన్ సంఘం ఆధ్వర్యంలో ఇచ్చిన వినతి పత్రానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షులు దుమ్మ అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండ తామన్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, నూకలమర్రి మాజీ ఎంపిటిసి బొడ్డు రాములు, పెంట కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, అక్కినపల్లి కరుణాకర్, బత్తుల కమలాకర్, తాళ్లపల్లి నాగరాజు, నేదురి నర్సయ్య, గసికంటి ప్రభాకర్, సామల్ల ప్రతాప్, నీరేటి ప్రసాద్, లక్కే సాగర్, నేదురి శ్రీకాంత్, మల్లారం హరీష్, లక్కే దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కాలేజి బాలుర వసతి గృహానికి ప్రహరీగోడను నిర్మించాలి

**అదనపు కలెక్టర్ డా.శ్రీజకు వినతి పత్రం**

**– టిఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యం**

**–ప్రహరీ గోడ లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**



ఖమ్మం, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ లో అడిషనల్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజను కలిసి గిరిజన బాలుర వసతి గృహంకి ప్రహరీ గోడ కట్టించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని, టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యం కలెక్టర్ ని కలిసి వినతి పత్రం అందించారు. ప్రహరీ గోడ కట్టించి విద్యార్థులను ఆకతాయిల నుండి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమళ్ల సత్యం, గొట్టే ముక్కల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కంటివెలుగు ఏఆర్ బిల్లులను ఇప్పించాలి



ఖమ్మం, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి): గత ప్రభుత్వ హాయంలో నిర్వహించిన కంటి వెలుగు 2కు సంబంధించిన ఏఆర్ బిల్లులను తక్షణమే అందించాలని పలువురు ఆప్టోమెట్రిస్టులు సోమవారం డిప్యూటీ కలెక్టర్ కు గ్రీవెన్స్ డే నందు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అప్టో మెట్రిస్టులు మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగులో 12 మంది ఆప్టో మెట్రిస్టులు తమ ఏఆర్ మిషన్లను అద్దెకు ఇచ్చామని కానీ వాటి అద్దె బిల్లులు ఇంతవరకు చెల్లించకుండా తమకు అన్యాయం చేశారని అన్నారు. కంటి వెలుగు ఐదు నెలలు గాను ఒక్కొకరికి 1లక్ష 25వేల రూపాయలు రావాల్సి ఉందని కానీ ఇంతవరకు తమకు చెల్లించలేదని అన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు తమకు బిల్లులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తమకు బిల్లులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్టామెట్రిస్టులు కొట్టి రవీందర్, సాతునూరి నాగేశ్వరరావు, సూతకాని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 65 ఫిర్యాదులు

**-ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**



సంగారెడ్డి సెప్టెంబర్ 23(నేటి నిజం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు . జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , ట్రై నీ కలెక్టర్ మనోజ్ , డి ఆర్ ఓ పద్మజ రాణి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలు వద్దు

**–దోషాలు తొలగిపోవాలని శాంతి హోమం చేసాం**

**– టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు**

తిరుమల సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలు వద్దని టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. ఇటీవల జరిగిన దోషాలు తొలగిపోవాలని శాంతి హోమం చేశామని పేర్కొన్నారు. పవిత్రోత్సవాల ముందు జరిగిన దోషం.. పవిత్రోత్సవాలతో పోయిందని అన్నారు. మార్చిన నెయ్యితోనే ప్రసాదాలు తయారు చేశామని చెప్పారు.శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిశాయనే వార్తలు ఇటీవల పెద్ద దుమారం రేపాయి. ఈ క్రమంలో జరిగిన మహా పాపానికి పరిహారంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వమించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ.. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేశామని తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లోనూ ప్రోక్షణ చేస్తున్నామని అన్నారు. తెలిసీ తెలియక జరిగిన దోషాలు శాంతి హోమం, ప్రోక్షణతో తొలగుతాయని అన్నారు. చివరగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగిపోతాయని చెప్పారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు దాడి

మెదక్ సెప్టెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడ్డారు. ఇటుకలు, రాళ్లతో విధ్వంసం సృష్టించారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆదివారం అర్ధరాత్రి హంగామా చేశారు. వినాయక నిమజ్జనం అడ్డుపెట్టుకుని గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ఇంటి గేటు ముందు పటాకులు కాల్చారు. అయితే ఆ ఇంట్లో ఉంటున్న మనిదీప్ గౌడ్ అనే యువకుడు ఇదేంటని అడిగితే.. అతనిపై దాడిచేశారు. అంతటితో ఆగకుండా ఇంటిపైకి ఇటుకలు విసిరారు.దీంతో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకొని కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. రాత్రిపూట దాడులు చేయడం కాంగ్రెస్ నాయకుల పిరికిపంద చర్య బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. దాడికి నిరసనగా ఎమ్మెల్యే అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

# డంపింగ్ యార్డ్ తరలింపు దీక్షలకు పలు సంఘాల సంఘీభావం

ఖమ్మం, సెప్టెంబర్ 23 : (నేటినిజం ప్రతినిధి): స్థానిక దానవాయిగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ను తరలించాలని గత నాలుగు రోజులుగా పార్టీలకతీతంగా డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలకు సోమవారం ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక, వీరనారీమణుల ఆశయ సాధన సమితిలు సంఘీభావం ప్రకటించాయి. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బానోతు బద్రు నాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడాల ఝాన్సీ, ఉపాధ్యక్షురాలు త్రివేణి, గౌరవ సలహాదారులు పుల్లూరు నాగయ్య లు




ఈ సందర్భంగా మాట్లాడుతూ... డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజానీకం పడుతున్న బాధలను వెల్లడించారు. ప్రజల కోరిక మేరకు ఇక్కడి నుండి డంపింగ్ యార్డ్ ను తరలించాలని డిమాండ్ కార్యక్రమంలో వీరనారీ మణుల ఆశయ సాధన సమితి నాయకులు భవాని, జ్యోతి పాల్గొన్నారు.

# కేంద్రంలో పురంధేశ్వరికి కీలక పదవి..

అమరావతి, సెప్టెంబర్ 23 : ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి కేంద్రం కీలక పదవి అప్పగించింది. కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ చైర్ పర్సన్ గా నియమించింది. పురందేశ్వరి ఈ పదవిలో 2026 వరకు కొనసాగనున్నారు. ఈ మేరకు లోక్ సభ స్పీకర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.